# ప్రజాశక్తి

గురువారం 29 జూన్ 2023

8 పేజీలు

విశాఖపట్నం  అనకాపల్లి

# స్కూల్ బ్యాగులు అరకొరే...!

- జిల్లాకు చేరనివి 45 వేలు
- పంపిణీదారుని అలసత్వం
- జగనన్న కిట్లు పూర్తిగా అందని వైనం

జగనన్న విద్యా కానుక కిట్లు (ఫైల్)

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

పాఠశాలలు తెరిచి రెండు వారాలు దాటింది. పాఠ్యపుస్తకాలు సహా విద్యాకానుక ద్వారా ప్రభుత్వం అందజేస్తామన్న మెటీరియల్ ఇప్పటికీ పూర్తి స్థాయిలో విద్యార్థులకు చేరలేదు. తరగతులు ప్రారంభమైనా పుస్తకాలు విద్యార్థులకు అరకొరగా ఇచ్చారు. బ్యాగ్‌లు మినహా మిగిలిన విద్యాకనుక కిట్లు విద్యార్థులకు పంపిణీచేసినట్లు విద్యాశాఖాధికారులు చెబుతున్నా... వాస్తవానికి ఒక్కో పాఠశాలలో ఒక్కో కిట్ సమస్య ఉంది. అన్నిటికంటే బ్యాగులు సమస్య ఎక్కువగా ఉంది. స్కూల్ బ్యాగులు తగినన్ని పంపిణీదారు జిల్లాకు ఇవ్వకపోవడంతో చిరిగిన పాత బ్యాగులతో స్కూళ్లకు వెళ్తున్నారు. జిల్లాలో లక్షా 23 వేల బ్యాగులు అవసరం కానున్నాయి. 24 మండలాల్లో సగం మండలాలకు బ్యాగులు చేరలేదు. ఇంతవరకు 78 వేల బ్యాగులు జిల్లాకు చేరాయి. ఇంకా 45 వేలు రావాల్సివుంది. అచ్యుతాపురం, బుచ్చయ్యపేట, చోడవరం, గొలుగొండ, కశింకోట, కోటవురట్ల, మాకవరపాలెం, నర్సీపట్నం, నాతవరం, పరవాడ, రావికమతం, రోలుగుంట, వి.మాడుగుల మాండలాలకు బ్యాగులు ఒక్కటీ చేరలేదు.

ఒకటి, రెండు రోజుల్లో బ్యాగులొస్తాయని విద్యాశాఖాధికారులు చెబుతున్నారు. బెల్టులు, షూలు అందరికీ వచ్చాయని చెబుతున్నా విద్యార్థులకు అందని పరిస్థితి ఉంది. బుచ్చెయ్యపేట మండలం వడ్డాది మండల ప్రాథమిక ఇంగ్లీష్ మీడియం పాఠశాలలలో బెల్ట్‌లు అందలేదని బాలికలు ప్రజాశక్తికి తెలిపారు. పరవాడ మండలం పెదముషిడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మగ పిల్లలకు బుధవారం షూలు ఇచ్చినట్లు విద్యార్థులు తెలిపారు. బాలికలకు షూ కొలతలు తీసినట్లు చెప్పారు.

ప్రతి పాఠశాలలోనూ జగనన్న విద్యాకనుక కిట్లు సరిపడా సకాలంలో రాక విద్యార్థులకు అందని పరిస్థితి ఉంది.

# అమ్మఒడి.. పేదలకు భరోసా

## విశాఖ జిల్లాలో 1,70,467, అనకాపల్లి జిల్లాలో 1,50,870 మందికి లబ్ధి

విశాఖ జిల్లాలో చెక్కును అందిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-విశాఖపట్నం : పిల్లల సంపూర్ణ అక్షరాస్యత సాధించడమే లక్ష్యంగా ప్రవేశపెట్టిన అమ్మఒడి పథకాన్ని విద్యార్థుల ఎదుగుదల కోసం తల్లితండ్రులు ఉపయోగించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సూచించారు. పెదగంట్యాడ మండలం నడుపూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం ఉదయం నిర్వహించిన జిల్లా స్థాయి అమ్మఒడి కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. విశాఖ జిల్లాలో సుమారు 1,70,467 మంది అర్హులైన తల్లుల బ్యాంక్ ఖాతాలో రూ.255 కోట్లా 70 లక్షలా 5వేలు జమ చేసినట్లు చెప్పారు. అమ్మఒడికి సంబంధించి అర్హత ఉండి ఏ కారణం చేతనైనా రాకపోయి ఉంటే సంబంధిత సచివాలయంలో తెలియజేస్తే వారు పరిష్కరించి వచ్చే విడతలో మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటారన్నారు. ఈ మొత్తాన్ని మెగా చెక్కు రూపంలో ప్రజా ప్రతినిధులతో కలిసి కలెక్టర్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, డిసిఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చిన్నతల్లి, డిఇఒ చంద్రకళ, సర్వ శిక్ష అభియాన్ ఎపిడి శ్రీనివాసరావు, కార్పొరేటర్లు, విద్యార్థుల తల్లులు పాల్గొన్నారు.

**అనకాపల్లి జిల్లాలో...**

**అనకాపల్లి :** అమ్మఒడి కార్యక్రమం ద్వారా అనకాపల్లి జిల్లాలో 1,50,870 మంది లబ్ధిదారులకు 226కోట్లా 30లక్షలా 50వేల రూపాయలు జమ చేసినట్టు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, కలెక్టర్ రవి పఠాన్ శెట్టి తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన అమ్మఒడి నాలుగో విడత కార్యక్రమంలో వారు పాల్గొని అమ్మఒడి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ తల్లి ఆర్థిక ఇబ్బందుల వల్ల తమ బిడ్డలను బడికి పంపకుండా ఉండకూడదనే గొప్ప సంకల్పంతో పిల్లలను బడికి పంపించే ప్రతి తల్లికీ ఏటా రూ15వేలు ఇస్తున్నట్లు తెలిపారు. పిల్లలందరూ బడిబాట పట్టి చక్కని విద్యను అభ్యసించడానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందని చెప్పారు. దీని వల్ల అక్షరాస్యత రేటు పెరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 2022-23 సంవత్సరంలో నాలుగో విడత 1,50,870 మంది తల్లుల ఖాతాలలో అమ్మఒడి సొమ్మును జమ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి వెంకట లక్ష్మమ్మ, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి శిరీష, గ్రామ వార్డ్ సచివాలయం నోడల్ అధికారి మంజులావాణి, ఎంపీపీ గొర్లి సూరిబాబు, కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కర్, పలువురు విద్యార్థులు, తల్లులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అనకాపల్లి జిల్లాలో చెక్కును అందిస్తున్న కలెక్టర్ రవి పఠాన్ శెట్టి, ఉప ముఖ్యమంత్రి ముత్యాలనాయుడు

**విద్యుత్ ఛార్జీల పెంపునకు నిరసనగా 30న సబ్‌స్టేషన్ల వద్ద ధర్నా : సిపిఎం**

వార్త 5లో..

**పన్నులతో ప్రజలను కొల్లగొడుతున్నారు**

వార్త 2లో..

**నూతన ఫుడ్ కోర్టు ఏర్పాటుకు సన్నాహాలు**

వార్త 2లో..

# విశాఖలో ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున్న బూడి, అమర్, విఎస్ఆర్

ప్రజాశక్తి-విశాఖపట్నం : రాష్ట్ర ముఖ్యమంత్రి జగనోన్మహన్‌రెడ్డి పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలో నిర్వహించే అమ్మఒడి కార్యక్రమంలో పాల్గొనేందుకు బుధవారం ఉదయం ప్రత్యేక విమానంలో విజయవాడ నుంచి విశాఖ విమానాశ్రయానికి ఉదయం 9.10 గంటలకు చేరుకున్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీలు విజయసాయి రెడ్డి, ఎంవివి.సత్యనారాయణ, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ, జివిఎంసి కమిషనర్ సాయికాంత్‌వర్మ, ఎమ్మెల్సీలు వంశీకృష్ణ యాదవ్, వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్ కుమార్, అదీప్‌రాజు, జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్, ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్ తదితరులు ముఖ్యమంత్రికి పుష్ప గుచ్చాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం ముఖ్యమంత్రి ప్రత్యేక హెలికాప్టర్లో 9.20 గంటలకు పార్వతీపురం-మన్యం జిల్లాకు బయలుదేరి వెళ్లారు.

# ఇండోర్ స్పోర్ట్స్ ఎరీనాను ప్రభుత్వమే నడపాలి

## సిపిఎం ఆందోళన

ఆందోళననుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం కార్పొరేటర్ గంగారావు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : స్మార్ట్ సిటీ ప్రాజెక్టు కింద ఎంవిపి కాలనీలోని ఎఎస్ రాజా కాలేజీ గ్రౌండ్ పక్కన 1.10 ఎకరాల విస్తీర్ణంలో రూ.25 కోట్లతో జివిఎంసి నిర్మించిన మల్టీ ఇండోర్ స్పోర్ట్స్ ఎరీనాను సహానీ ప్రయివేటు సంస్థకు కట్టబెట్టడాన్ని వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యాన బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ, ప్రజల ఆస్తులను ప్రయివేటు సంస్థలకు దోచిపెట్టే నిర్ణయాలను జివిఎంసి ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇండోర్ స్పోర్ట్సును ప్రయివేటు సంస్థకు ఇవ్వకుండా, దీని నిర్వహణ బాధ్యతను జివిఎంసి చూడాలని, భారీగా విధించిన ఫీజులు రద్దుచేయాలని కోరారు. ఎరీనాను గత నెలలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. సెంట్రల్ ఎసితో కూడిన స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నాలుగు బ్యాడ్మింటన్ కోర్టులు, 2 స్విమ్మింగ్ పూల్స్, బాస్కెట్‌బాల్ కోర్టులు, వాలీబాల్ కోర్టు, 2 టేబుల్ టెన్నిస్ కోర్టులు, వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, డార్మెటరీస్ తదితర అనేక రకాల క్రీడా సదుపాయాలున్నాయని, ఇన్ని సదుపాయాలు ఉన్న ఎరీనాను ప్రజలు వినియోగించుకొనే అవకాశంలేకుండా, ప్రయివేటు సంస్థకు జివిఎంసి, ప్రభుత్వం అప్పగించడం తగదన్నారు. స్విమ్మింగ్‌పూల్‌కు నెలకు రూ.5000, బాడ్మింటిన్‌కు రూ.5000, వాలీబాల్‌కు రూ.6000, టేబుల్ టెన్నిస్‌కు రూ.2,500, చెస్‌కు రూ.1500, యోగాకు రూ.2000, ఆదివారం

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

## ఇండోర్ స్పోర్ట్స్ ఎరీనాను ప్రభుత్వమే నడపాలి : సిపిఎం

రోజున బ్యాడ్మింటన్‌కు ప్రతి గంటకూ రూ.1000, జిమ్‌క్రాస్ ఫిట్ ట్రైనింగ్‌కు రూ.8000 చొప్పున ప్రయివేటు సంస్థ వసూలు చేస్తోందన్నారు. అదనంగా 18 శాతం జిఎస్‌టి చెల్లించాలని తెలిపారు. రాబోయే కాలంలో ఈ ధరలు మరింత పెంచే అవకాశముందని చెప్పారు. ఈ ఫీజులు నిర్ణయంలోనూ, ధరల నియంత్రణలోనూ జివిఎంసికి అధికారం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం చేసిందన్నారు. విచ్చలవిడిగా డబ్బులు దోచుకొనే అవకాశం ప్రయివేటు సంస్థకు కల్పించిందని విమర్శించారు. నామమాత్రంగా ఏడాదికి కేవలం రూ.1.04 కోట్లు మాత్రమే చెల్లించి, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో క్రీడా శిక్షణ పేర అనేక వ్యాపార కార్యక్రమాలు నిర్వహించుకొనే అవకాశమిచ్చిందని విమర్శించారు. ప్రజల సొమ్ముతో నిర్మించి కాంట్రాక్టర్లకు లాభాలు చేకూర్చడం, డబ్బున్న కొద్దిమందికే పరిమితం చేయడం సరికాదన్నారు. తక్షణమే ప్రయివేటీకరణ చర్యలు వీడకపోతే ప్రజాఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ ధర్నాలో సిపిఎం మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు, నాయకులు కె.కుమారి, పి.వెంకటరావు, కోదండ, అప్పారావు, తులసీరాం, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విజేతలతో అతిథులు

## ముగిసిన టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖపట్నం జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన ఎంఎస్ఆర్‌పిటిటిఏ కార్పొరేట్, ఆహ్వాన టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ విజయవంతంగా ముగిసింది. ఆంధ్రప్రదేశ్ నుంచి వివిధ సంస్థలకు చెందిన 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో సింగిల్స్ విభాగంలో విజేతగా జయసూర్యన్, రన్నర్‌గా డాక్టర్ డివిఎస్‌వై.శర్మ, తృతీయ స్థానంలో ఎం.రవికుమార్, నాలుగో స్థానంలో వంశీ నిలిచారు. డబుల్స్ విభాగంలో జయసూర్యన్, భాగ్య రాజ్ విజేతలుగా, యుగంధర్, కిరణ్ రన్నర్స్‌గా నిలిచారు. విజేతలకు ముఖ్య అతిథులుద్వారా బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ డివిఎస్‌వై.శర్మ, శ్రీకృష్ణమూర్తి పాల్గొన్నారు.

చెక్కును అందిస్తున్న కరూర్ వైశ్యా బ్యాంక్ ఎమ్‌డి రమేష్‌బాబు

## కరూర్ వైశ్యా బ్యాంక్ సహకారం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : కరూర్ వైశ్యా బ్యాంక్ తన సిఎస్ఆర్ కార్యకలాపాల్లో భాగంగా విశాఖపట్నంలోని ఇంటిగ్రేటెడ్ గెరియాట్రిక్ అండ్ పల్లియేటివ్ కేర్ కేంద్రంలోని వయోవృద్ధులు, అనారోగ్యంతో అంతిమదశలో ఉన్న రోగులకు సంరక్షణ అందించడానికి ఒక బ్లాక్ నిర్మాణం కోసం స్నేహ సంధ్య ఏజ్ కేర్ ఫౌండేషన్‌కు రూ.1.60 కోట్లు మంజూరు చేసింది. స్నేహ సంధ్య ఏజ్ కేర్ ఫౌండేషన్ ట్రస్టీలకు రూ.50 లక్షల డిమాండ్ డ్రాఫ్టును కరూర్ వైశ్యా బ్యాంక్ ఎమ్‌డి, సిఇఒ బి.రమేష్‌బాబు అందజేశారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ, మహనీయమైన ప్రయోజనం కోసం తమ సిఎస్ఆర్ ద్వారా నిధులు అందించినందుకు ఆనందంగా ఉందన్నారు. ఫౌండేషన్ ట్రస్టీలు, వైద్యులు, సిబ్బంది చేస్తున్న కృషిని అభినందించారు. చివరి విడతగా ఇవ్వాల్సిన రూ. 86 లక్షలను వైద్య పరికరాలకు కేటాయించినట్లు తెలిపారు.

# పన్నులతో కొల్లగొడుతున్నారు : వార్వా, నివాస్

ప్రజాశక్తి - సీతమ్మధార : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల ఆస్తులతో ఆటలాడుకుంటున్నాయని, ఆస్తి విలువ, పన్నులు, యూజర్ ఛార్జీల పేరుతో వారిని కొల్లగొడుతున్నారని వార్వా-నివాస్ కార్యదర్శులు బిబి.గణేష్, పిట్ట నారాయణమూర్తి పేర్కొన్నారు. బుధవారం ఉదయం హెచ్‌బి కాలనీలోని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని అస్తుల విలువలను 20 శాతం నుంచి 35 శాతం ఈ నెలలోనే పెంచిందన్నారు. తద్వారా రాష్ట్ర ప్రజలపైన రూ.1800 కోట్లు, విశాఖ నగర ప్రజలపై రూ.200 కోట్ల అదనపు భారం పడిందన్నారు. ప్రభుత్వం ఆస్తుల విలువలు పెంచడం వల్ల యజమాని ఆస్తి విలువ పెరుగుతుందని అధికార్లు చెబుతున్నారని, ఆ విలువ అమ్ముకొనేటప్పుడు మాత్రమే లభించేదని గమనించాలని సూచించారు. అధికార్ల వివరణలు చూస్తే రియల్ ఎస్టేట్ రంగం ద్వారా వచ్చే రిజిస్ట్రేషన్ ఆదాయాన్ని పెంచుకోవడానికి మాత్రమే ఈ ఆస్తుల విలువల పెంపుదల ఉద్దేశం అని అర్థం అవుతుందన్నారు. ఆస్తి విలువకు ఇంటిపన్నును లింకు చేసి ఆస్తిపన్నుగా మార్చారని, దీని వల్ల ఆస్తిపన్ను కూడా 20 శాతం నుంచి 85 శాతం వరకు పెరుగుతుందనే సత్యాన్ని పక్కన పెడుతున్నారని విమర్శించారు. ఆస్తిపన్నును ఏటా 20 శాతానికి తక్కువ కాకుండా పెరిగేలా రాష్ట్రాలు చట్టాల్లో మార్పు తీసుకురావాలని సూచనల పేరుతో కేంద్ర ప్రభుత్వం షరతులు విధించిందని తెలిపారు. మున్సిపల్ బాండ్లు ప్రకటించడం, ఆస్తి పన్ను చెల్లింపులను పెంచుకోవడంపై ప్రత్యేక సూచనలు చేస్తూ రోడ్ మ్యాప్ తయారు చేసుకొమ్మని చెప్పిందని వివరించారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ పట్టణ సంస్కరణల మూలంగా ఇంటిపన్ను ఆస్తిపన్నుగా మారిందన్నారు. పెంచిన ఆస్తిపన్ను, చెత్త సేకరణ యూజర్ చార్జీలు, పార్కింగ్ ఫీజులు, ఇతర యూజర్ చార్జీలతో నగర ప్రజలు సతమతమవుతున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సూచనలను రాష్ట్రాలు ఆమోదించరాదని, ఆస్తి విలువతో ఆస్తి పన్నుకు పెట్టిన లింకును ఉపసంహరించాలని, పన్నులు, యూజర్ ఛార్జీల భారం తగ్గించాలని డిమాండ్‌చేశారు.

మాట్లాడుతున్న వార్వా, నివాస్ ప్రతినిధులు

# నూతన ఫుడ్ కోర్ట్ ఏర్పాటుకు సన్నాహాలు

### జివిఎంసి ఫుడ్ కమిటీ చైర్మన్ కట్టుమూరి సతీష్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖపట్నంలోని సెంట్రల్ పార్క్ వద్ద ఉన్న నైట్ ఫుడ్ కోర్టులోని 149 షాపులు అనధికారికమైనవని, వీటిని రానున్న పది రోజుల్లో తొలగించి, వాటి స్థానంలో జివిఎంసి నూతనంగా నిర్మించే సముదాయాలలో కొత్తవారికి అవకాశం కల్పిస్తామని డిప్యూటీ మేయర్, ఫుడ్ కమిటీ చైర్మన్ కట్టుమూరి సతీష్ తెలిపారు. బుధవారం సాయంత్రం జివిఎంసి కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆ ప్రాంతంలో ప్రస్తుతం నడుస్తున్న 149 షాపులకు సంబంధించి జివిఎంసి, ఎంఆర్‌డిఎకు ఎటువంటి చెల్లింపులు చేయడం లేదని, కొందరు అక్కడ కరెంటును చోరీ చేసి ఉపయోగిస్తున్నారని తెలిపారు. మేయర్ ఏర్పాటుచేసిన 10 మంది కమిటీలోని ఐదుగురు సభ్యులు ఆ ప్రాంతాన్ని పరిశీలించారని, అక్కడ వ్యాపారం చేస్తున్న చాలామందికి వెండర్ కార్డులు, తాత్కాలిక లైసెన్సులు లేవని చెప్పారు. వాటిని తొలగించి 90 నూతన షాపులను ఏర్పాటుచేసి మేయర్ ఆధ్వర్యాన డ్రా తీసి నిజమైన వ్యాపారస్తులకు కేటాయించనున్నట్లు తెలిపారు. ఆ షాపులకు కనీస అద్దె రూ.5000, అత్యధికంగా రూ.15 వేలు నిర్ణయించినట్లు చెప్పారు. ఒకే వ్యక్తిపై ఎక్కువ షాపులు ఉండకుండా వెండర్ కార్డును ఆధార్ కార్డుతో సీడ్ చేస్తామని తెలిపారు. బీచ్ రోడ్డులో ఇప్పటికే హాకర్ జోన్లపై దృష్టి సారిస్తామన్నారు. బీచ్ రోడ్ అనంతరం గాజువాక, అనకాపల్లిలో కూడా ఇటువంటి ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ కమిటీ మెంబర్స్ భీశెట్టి వసంతలక్ష్మి, సాదిక్, ఉరుకుట్టి నారాయణ, నేక్కేళ్ళ లక్ష్మి పాల్గొన్నారు

# స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : ప్రభుత్వ రంగంలోని విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం సొంత గనులు కేటాయించాలని, పర్మినెంట్ ఉద్యోగుల నియామకాలు చేయాలని స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఎంఎస్ యూనియన్ అధ్యక్షులు డి.అప్పారావు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక ప్రజాసంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు బుధవారం నాటికి 818వ రోజుకు చేరాయి. దీక్షల్లో హెచ్‌ఎంఎస్ ఉద్యోగులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటామని ప్రధాని మోడీ ప్రకటించాలన్నారు. పెదగంట్యాడ సిడబ్ల్యుసి సభ్యులు ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలన్నారు. యూనియన్ నాయకులు ఉరుకూటి సుభాషిణి మాట్లాడుతూ, అవసరమైతే స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం ప్రాణత్యాగమైనా చేస్తామన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఆపాలని, లేకుంటే ఈ ఉద్యమం మరింత ఉధృతం అవుతుందని స్పష్టంచేశారు.

# 'ఎనర్జీ ఆఫ్ ఇండియా'గా ఇండియన్ ఆయిల్ ఖ్యాతి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఇండియన్ ఆయిల్, చమురు, గ్యాస్, పెట్రోకెమికల్స్, ప్రత్యామ్నాయ ఇంధన వనరులు సహా దాదాపు అన్నింటిలో కార్యకలాపాలు నిర్వహిస్తూ 'ఎనర్జీ ఆఫ్ ఇండియా' గా ఖ్యాతి గడించిందని ఇండియన్ ఆయిల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ స్టేట్ హెడ్ బి.అనీల్‌కుమార్ తెలిపారు. బుధవారం ఉదయం నగరంలోని ఫోర్ పాయింట్స్ హోటల్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఇంటిగ్రేటెడ్ ఎనర్జీ మేజర్‌గా ప్రసిద్ధి చెందిన ఇండియన్ ఆయిల్ సంస్థ శ్రీలంక, మారిషస్, యుఎఇ తదితర దేశాలలో ఇండియన్ ఆయిల్ వ్యాపార కార్యకలాపాలను నెరవేరుస్తుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఫార్చ్యూన్ 500 కంపెనీల జాబితాలో 142వ స్థానంలో ఉందని తెలిపారు. ప్రతిరోజూ సుమారు 30 మిలియన్ల మంది భారతీయుల కలలు, ఆకాంక్షలకు తోడ్పాటునందిస్తూ 36285 రిటైల్ అవుట్‌లెట్ల నెట్‌వర్క్ ద్వారా ఇండియన్ ఆయిల్ విలువైన పెట్రోలియం ఇంధనాలను దేశంలోని ప్రతి మూలకు చేరుస్తుందన్నారు. సంస్థకు 132 ఏవియేషన్ ఇంధన కేంద్రాలు, 108 ఎల్‌పిజి బాట్లింగ్ ప్లాంట్లు, 14.6 కోట్ల వినియోగదారులతో సహ 4.54 కోట్ల పిఎంయువై కస్టమర్లకు ప్రతిరోజూ దాదాపు 27 లక్షల సిలిండర్లను అందజేస్తున్నామని చెప్పారు. దేశవ్యాప్తంగా పిఒఎల్ ఉత్పత్తులను నిల్వ చేయడానికి, పంపిణీ చేయడానికి కంపెనీ 120 డిపోలు, టెర్మినల్స్ కలిగి ఉందన్నారు.

ఇండియన్ ఆయిల్ రూ.2 లక్షల కోట్ల పెట్టుబడితో 2046 నాటికి నెట్ - జీరో నిర్గమన ఉద్గారాల లక్ష్యం సాధించాలని సంకల్పించిందని తెలిపారు. ఈ సమావేశంలో సంస్థకు చెందిన ఆంధ్ర, తెలంగాణా ప్రతినిధులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఇండియన్ ఆయిల్ ప్రతినిధులు

## విజయనగరం, శ్రీకాకుళం రైల్వే స్టేషన్లకు ఈట్ రైట్ సర్టిఫికెట్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విజయనగరం, శ్రీకాకుళం రోడ్ రైల్వే స్టేషన్లు ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్‌ఎస్‌ఎస్‌ఎఐ)చే 'ఈట్ రైట్ స్టేషన్లు'గా ధ్రువీకరించబడ్డాయి. ఈ సర్టిఫికేషన్ 'ఈట్ రైట్ ఇండియా' ఉద్యమంలో భాగంగా భారతీయులందరికీ సురక్షితమైన, ఆరోగ్యకరమైన, స్థిరమైన ఆహారాన్ని అందించడానికి, దేశ ఆహార వ్యవస్థను మార్చడానికి ఎఫ్‌ఎస్‌ఎస్‌ఎఐ చేసిన పెద్ద ప్రయత్నం. వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్ సత్పతి మాట్లాడుతూ, రైల్వే ప్రయాణికులకు సురక్షితమైన, పరిశుభ్రమైన ఆహారం అందుబాటులో ఉండేలా ఈ స్టేషన్లలో రైల్వే అధికారులు చేసిన శ్రేష్ఠమైన ప్రయత్నాలను ఈ ధ్రువీకరణ పత్రం సూచిస్తోందని తెలిపారు. ఈ రైల్వే స్టేషన్లలోని అన్ని క్యాటరింగ్ స్టాల్స్‌కు ఫుడ్ లైసెన్స్ సర్టిఫికెట్లను అందించారని, విక్రేతలు మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను కలిగి ఉన్నారని పేర్కొన్నారు.

## వాల్తేర్ డివిజన్‌లో రైళ్ల నియంత్రణ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : వాల్తేరు డివిజన్‌లోని రాయగడ-విజయనగరం లైను వంతెన పునర్నిర్మాణ పనుల కోసం ట్రాఫిక్ కమ్ పవర్ బ్లాక్ కారణంగా పలు రైళ్లను నియంత్రిస్తున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. 08546 విశాఖపట్నం-కోరాపుట్ ప్యాసింజర్ ప్రత్యేక రైలు, 08545 కోరాపుట్ - విశాఖపట్నం ప్యాసింజర్ ప్రత్యేక రైళ్లను ఈ నెల 29న రద్దుచేశారు. ఈ నెల 28న గుంటూరు నుంచి బయలుదేరే 17243 గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్ రైలు విజయనగరం వద్ద షార్ట్ టర్మినేట్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. తిరుగు ప్రయాణంలో 17244 రాయగడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్ 29న రాయగడకు బదులుగా విజయనగరం నుంచి బయలుదేరుతుందని వివరించారు. ప్రజలు మార్పులను గమనించాలని రైల్వే శాఖ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎకె.త్రిపాఠి కోరారు.

## జోన్-5లో బహిరంగ వేలం

విశాఖపట్నం : జివిఎంసి జ్ఞానాపురం జోనల్ కార్యాలయం పరిధిలో గల 40 నుంచి 60వ వార్డుల వరకు ఖాళీగా ఉన్న దుకాణాలు, కళ్యాణ మండపాలు, రోడ్ సైడ్ మార్కెట్లకు జులై 14న బహిరంగ వేలం వేయనున్నట్లు జోనల్ కమిషనర్ ఆర్‌జివి.కృష్ణ తెలిపారు.

# అదృశ్యమైన చైతన్య విద్యార్థులు సేఫ్!

## సికింద్రాబాద్‌లో ప్రత్యక్షం
## ఐదు రోజుల ఉత్కంఠకు తెర

సికింద్రాబాదులో గుర్తించిన గాజువాక చైతన్య విద్యార్థులు

ప్రజాశక్తి -గాజువాక :గాజువాక చైతన్య కళాశాల విద్యార్థుల అదృశ్యంపై ఐదురోజుల ఉత్కంఠకు తెరపడింది. ఈనెల 25న గాజువాక నుంచి కె.కోటపాడు వెళ్లిన ముగ్గురు విద్యార్థులు తర్వాత కనిపించకుండా పోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు గాజువాక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై గాజువాక పోలీసులు ప్రతిష్టాత్మకంగా తీసుకుని, విభిన్న కోణాల్లో దర్యాప్తును చేపట్టడంతో సికింద్రాబాద్‌లో సేఫ్‌గా ఉన్నట్లు గుర్తించారు. వారిని గాజువాక తెచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, ఈ మేరకొక టీమ్‌ను సికింద్రాబాద్‌కు పంపించినట్లు పోలీసులు తెలిపారు.

## బదిలీ ఉపాధ్యాయులకు ఘన వీడ్కోలు

ప్రజాశక్తి -పద్మనాభం: మండలంలోని మద్ది జిల్లా పరిషత్ హైస్కూల్లో ఇటీవల నలుగురు ఉపాధ్యాయులు బదిలీకాగా, వారికి ఎంపిపి కె.రాంబాబు ఆధ్వర్యంలో బుధవారం వీడ్కోలు అభినందన సభ నిర్వహించారు. హెచ్ఎం ఎం.సన్యాసిరావు, ఉపాధ్యాయులు శ్రీనివాస రావు, సీతారాం, ఇ.వెంకటపతిరాజు ఒక్కొక్కరు మద్ది హైస్కూల్‌లో విధులు నిర్వహించగా, బదిలీ అయిన నలుగురికి ఘన వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. వీరి హయాంలో నాడునేడు పనుల అమలులో జిల్లాలోనే ప్రథమస్థానంలో నిలిచిందని అభినందించారు. సర్పంచ్ బి.సన్యాసం ఆధ్వర్యంలో స్థానిక కల్యాణమండపంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి- ఆనందపురం : ఎపిఇపిడిసిఎల్ మూడో జోన్ ఆపరేషన్స్ ఇఇ పోలాకి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఆనందపురం మండలంలో శుక్రవారం విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనులు చేపట్టనున్నట్లు ఎఇఇ సురేష్‌కుమార్ ప్రకటనతో తెలిపారు దీంతో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పెద్దిపాలెం, బిపి కల్లాలు, మచ్చవానిపాలెం, చందక, గొట్టిపల్లి, వెంకటాపురం, జగన్నాధపురం, పొడుగుపాలెం తదితర పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

## రైతులకు వరి విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి -పద్మనాభం: మండలంలోని మద్ది పంచాయతీ రైతు భరోసా కేంద్రంలో బుధవారం వరి విత్తనాలను పంపిణీ చేశారు. మండల వ్యవసాయ శాఖ అధికారి ఎంవి చలం ఆధ్వర్యంలో ఎంపిపి కె.రాంబాబు పాల్గొని, ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులకు వరి విత్తనాల పంపిణీని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ, ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన వరి విత్తనాలు ఆర్‌బికెల్లో అందుబాటులో ఉన్నాయని, రైతులను విత్తనాలను కొనుగోలుచేసి, అదునుచూసి నారుమళ్లల్లో వేసుకోవాలని సూచించారు.

## తునిపాలెంలో గ్రామీణ గ్రంథాలయం

ప్రజాశక్తి -పద్మనాభం: మండలంలోని మద్ది గ్రామపంచాయతీ తునిపాలెంలో గ్రామీణ గ్రంథాలయాన్ని ఎంపిపి కె.రాంబాబు బుధవారం ప్రారంభించారు. గ్రంథాలయం ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చుని, దీన్ని గ్రామీణ ప్రజలు, నిరుద్యోగులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు

# అవసరం లేనిచోట బస్ షెల్టర్లు

## అనేక చోట్ల ప్రయాణికుల అగచాట్లు ... పట్టని అధికారులు

తగరపువలసలో దుకాణాల వద్ద ఆరుబయటే ప్రయాణికులు అవస్థలు... శివాలయం వద్ద అవసరం లేని చోట ఖాళీ బస్‌షెల్టర్

ప్రజాశక్తి -తగరపువలస : అవసరం లేని చోట్ల బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయడంపై పలువురు ప్రజలు, ప్రయాణికులు ఒకింత విస్మయానికి గురవుతున్నారు. అనునిత్యం రద్దీగా ఉండే తగరపువలస జంక్షన్‌లో కనీసం బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలంటూ ఏళ్ల తరబడి ఇక్కడి ప్రజలు, ప్రయాణికులు అధికారులను కోరుతున్నారు.బస్ షెల్టర్ ఏర్పాటు చేయాల్సింది ఆర్‌టిసినా? జివిఎంసినా? అన్నది పక్కనబెడితే, స్థానిక జంక్షన్‌లో బస్‌షెల్టర్ అవసరాన్ని ఎవరూ కాదనలేని వాస్తవం. ఇక్కడ బస్‌షెల్టర్ లేకపోవడంతో విశాఖవైపు వెళ్లే వందలాది ప్రయాణికులు మండే ఎండలో, కురిసే వర్షంలో అవస్థలు పడుతూ, బస్‌ల కోసం ఆరుబయటే నిలబడాల్సిన దుస్థితి కొన్నేళ్లుగా ఉంది.

ఉపాధి కోసం కార్మికులు, ఉద్యోగులు, చదువు కోసం విద్యార్థులు ఎంతో మంది ఇక్కడి జంక్షన్‌లో బస్సుల కోసం వేచిచూస్తూ, నిలువనీడ లేక సమీపంలో ఉన్న దుకాణాల నీడన నిల్చునే దుస్థితి ఉంది. ఇంతటి అత్యవసరమున్న చోట బస్‌షెల్టర్ ఏర్పాటు చేయలేదు. అలానే హైవే వద్ద వెంకటేశ్వర మెట్టవద్ద ఒకవైపు బస్‌షెల్టర్ ఉన్నప్పటికీ, రెండో వైపు బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

### నిరుపయోగంగా బస్‌షెల్టర్లు

అవసరమైన చోట, ప్రయాణికుల రద్దీ ఉన్న ప్రాంతాల్లో బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు గగ్గోలు పెడుతుంటే, వాటన్నింటినీ గాలికొదిలేసి, తాజాగా శివాలయం ఎదురుగా బస్‌షెల్టర్ ఏర్పాటు చేశారు ఇక్కడ ప్రయాణికులు ఎవరూ రాని పరిస్థితి. విశాఖ, పెందుర్తి, సింహాచలం ప్రాంతాలనుంచి వచ్చే 222 ,55 టి తదితర బస్సులు ఇక్కడ మలుపు తిప్పుతారు. అంటే బస్సులు తిప్పుకునే ప్రాంతం వద్ద బస్‌షెల్టర్ ఏర్పాటు చేయడం విడ్డూరంగా ఉందని పలువురు విస్తుపోతున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన బస్‌షెల్టర్‌ను తగరపువలస జంక్షన్, భీమిలి రోడ్డు వద్ద ఏర్పాటు చేస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉండేదని ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు కోరుతున్నారు భీమిలి రోడ్డులో గణేష్ సినిమా థియేటర్ కు వెళ్ళే రోడ్డు పక్కన ఏనాడో ఏర్పాటు చేసిన బస్‌షెల్టర్ నిరుపయోగంగానే ఉంది. కొంతమంది అధికారుల అనాలోచిత నిర్ణయాల వల్ల ఇలా అవసరం లేని చోట బస్‌షెల్ట ర్లు ఏర్పాటు చేస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ, జలకు అవసరమైన చోట బస్‌షెల్టర్ల ఏర్పాటులో మాత్రం నిర్లక్ష్యం చూపిస్తున్నారనే విమర్శలున్నాయి.

# గంగవరం పోర్టులో పర్యటించిన పోలీస్ కమిషనర్

ప్రజాశక్తి- గాజువాక: నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ బుధవారం గంగవరంలో పర్యటించారు. కొద్దిరోజులుగా వేతన సమస్యలపై ఆందోళన చేస్తున్న పోర్టు కార్మికులు, దిబ్బపాలేనికి ఆనుకుని ఉన్న గంగవరం పోర్టు గోడను తొలగించి, జెట్టీలోకి ప్రవేశిస్తారని సమాచారం రావడంతో, అక్కడి పరిస్థితులను పరిశీలించేందుకు ముందస్తుగా ఆ ప్రాంతంలో పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ పర్యటించారు.అక్కడి పోలీసు భద్రత, రక్షణ చర్యలపై పరిశీలించారు. తర్వాత ఆదాని గంగవరం పోర్టు ముఖద్వారం వద్దకు వచ్చి, బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. తర్వాత గంగవరం పోర్టు లోపలికి వెళ్లి గంట పాటు రహస్య సమావేశం నిర్వహించి, నగరానికి తిరుగుపయనమయ్యారు సిపితోపాటు . డిసిపి నాగన్న, ఎసిపిలు, గాజువాక, న్యూపోర్టు సీఐలు, ఎస్ఐలు పోలీసులు ఉన్నారు..

# క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి-సీతమ్మధార : పౌర గ్రంథాలయంలో పోటీ పరీక్షల్లో సిద్ధమవుతున్న విద్యార్థులకు బుధవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. సమకాలీన అంశాలు, జాతీయ ఉద్యమం, శాస్త్రసాంకేతిక విజ్ఞానం, భారత రాజ్యాంగం, ఆర్థిక భూగోళ శాస్త్రాలు మొదలైన విషయాలపై నిర్వహించిన క్విజ్ పోటీలో ఏడు బృందాలుగా 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు. గ్రంథాలయం సంయుక్త కార్యదర్శి డాక్టర్ డివి సూర్యా రావు క్విజ్ మాస్టర్‌గా వ్యవహరించి పోటీ నిర్వహించారు. విజేతలకు బహుమతి ప్రదానం చేశారు పోటీ పరీక్షలకు సన్నద్ధమౌతున్న వారికి ఇటువంటి కార్యక్రమాలు ప్రయోజనకరంగా ఉంటాయని సూచించారు.

## 90 మందికి ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని వేములవలసలో సత్యసాయి బాబా సేవాసమితి సహకారంతో విశాఖ పెదవాల్తేరు ఐ హాస్పిటల్ ట్రస్ట్ సౌజన్యంతో బుధవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరం విజయవంతమైంది. వైద్యశిబిరాన్ని మాజీ సర్పంచ్ కోరాడ అప్పలస్వామి నాయుడు ప్రారంభించారు. శిబిరంలో 90 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. దృష్టిలోపం ఉన్న పదిమందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వారికి ఆసుపత్రికి తరలించి, ఉచితంగానే ఆపరేషన్లు చేయిస్తామన్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కంటిరోగాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర స్కూల్ కరెస్పాండెంట్ ఎ. గణేష్, సత్యసాయి సంస్థ జోన్ కోఆర్డినేటర్ ఎంవి సత్యసాయి కుమార్, విశాఖ ఐ హాస్పిటల్ కోఆర్డినేటర్ ఇ.సాయికృష్ణ, గొట్టిపల్లి భజనమండలి కన్వీనర్ s. తమ్ము నాయుడు, జోనల్ యూత్ కోఆర్డినేటర్ డి. శరత్ కుమార్, కె.గోపి, కె. లక్ష్మణమూర్తి, పి వీరబ్రహ్మం పాల్గొన్నారు

## ఫుట్‌పాత్‌పై ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి- సీతమ్మధార : జివిఎంసి కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ ఆదేశాల మేరకు మూడో జోన్ పరిధిలోని ఫుట్‌పాత్‌లపై అనధికార బడ్డీలు, ఇతరత్రా ఆక్రమణలను తొలగించినట్లు టిపిఒ తేజ తెలిపారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సూచించారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారులు ఎసిపి, డిసిపి, టిపిఒ, చైన్‌మ్యాన్లు పాల్గొన్నారు

## అనధికార నిర్మాణాలపై కొరడా

ప్రజాశక్తి - ఆరిలోవ : అనధికార కట్టడాలపై టౌన్‌ప్లానింగ్ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. ఇటీవల 12వ వార్డులో వరుసగా పలుచోట్ల నిబంధనలకు విరుద్ధంగా, అనధికారికంగా నిర్మిస్తున్న అదనపు అంతస్తులను తొలగించారు. బుధవారం 10వ వార్డు పాతడెయిరీఫారం వద్దగల ఒక భవనంలో నిర్మిస్తున్న అనధికారికంగా అదనపు అంతస్తును టౌన్‌ప్లానింగ్ అధికారుల ఆదేశాల మేరకు తొలగించారు.

# నేరాలు ఘోరాలు

## కారును ఢీకొట్టి బైకిస్ట్ దుర్మరణం

మృతుడు మనోహర్

ప్రజాశక్తి- సింహాచలం: సింహాచలం గ్రామీణ ఆరోగ్య కేంద్రం వద్ద ప్రధాన రహదారి వద్ద బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో బైకిస్టు దుర్మరణం పాలయ్యాడు. కారును ఢీకొట్టి సంఘటనాస్థలిలోనే మృత్యువాత పడ్డాడు. వివరాలవి. ఎస్ రాయవరం ఇందిరా కాలనీకి చెందిన ఎం.మనోహర్ (24) మూడు రోజుల క్రితం సింహాచలం గాంధీనగర్ ప్రాంతంలో తన బంధువుల ఇంటికి వచ్చాడు. బుధవారం తిరుగు ప్రయాణమైన మనోహర్, బైక్‌పై వెళుతూ వేపగుంట మీదుగా సింహాచలం వస్తున్న కారును బలంగా ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు మనోహర్ రాంబిల్లి ఫార్మాసిటీలో విధులు నిర్వహిస్తున్నాడని బంధువులు తెలిపారు. సంఘటన స్థలానికి చేరుకున్న గోపాలపట్నం పోలీసులు, ప్రమాదంపై ఆరా తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి కెజిహెచ్‌కు తరలించారు. కేసును గోపాలపట్నం ఎస్ఐ దర్యాప్తు చేస్తున్నారు.

## 21 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-చోడవరం : మండలంలోని గౌరీపట్నం రోడ్డు వద్ద పోలీసులు 21 కేజీల గంజాయిని బుధవారం పట్టుకున్నారు. ఎస్ఐ అప్పలనాయుడు కథనం ప్రకారం... ముందస్తు సమాచారం మేరకు గౌరీపట్నం వద్ద వాహన తనిఖీలు చేపట్టిన పోలీసులు, వడ్డాది వైపు నుండి చోడవరం వైపు వస్తున్న గూడ్స్ వ్యాన్‌ను ఆపి తనిఖీ చేయగా అందులో 21 కేజీలు గంజాయి పట్టుబడింది. గంజాయి తరలిస్తున్న వ్యాన్ డ్రైవర్ కర్ణాటక రాష్ట్రానికి చెందిన రితీష్ కుమార్ విల్సన, చిత్తూరు జిల్లాకు చెందిన శ్రీధర్ కుమార్‌ను అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

## మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి- ఎస్.రాయవరం : మండలంలో గెడ్డపాలెంలో గడ్డి మందు తాగి మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. ఇచ్చిన సమాచారం మేరకు.. గెడ్డపాలెం గ్రామానికి చెందిన మాదేపల్లి అమలావతి (39) తన భర్త మాణిక్యం ఈ నెల 26న రాత్రి కూర బాగా వండలేదని కోప్పడ్డాన్న దిగులుతో అదే రోజు రాత్రి 11 గంటల సమయంలో గడ్డి మందును ఆమె తాగింది. భర్తను భయ పెట్టేందుకు గడ్డి మందు తాగినట్లు కుమార్తె తల్లు సంధ్య తెలిపిందన్నారు. మరుసటి రోజు ఉదయం 9గంటల సమయంలో నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి, మెరుగైన చికిత్స కోసం కెజిహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మరణించినట్లు తెలిపారు. అమలావతి కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు.

## తల్లి అదృశ్యంపై కొడుకు ఫిర్యాదు

బోండా బంగారమ్మ

ప్రజాశక్తి- పెందుర్తి : పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని వేపగుంట ప్రాంతానికి చెందిన బొంద బంగారమ్మ కనబడటం లేదని ఆమె కొడుకు శంకర్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు వివరాలివి. వేపగుంట వరలక్ష్మీనగర్ ప్రాంతానికి చెందిన బోండా బంగారమ్మ ఈనెల 26న ఇంట్లో నుంచి బయటకు వెళ్లి రాలేదని కొడుకు శంకర్ ఫిర్యాదు చేశాడు. తన తల్లి ఆచూకీ కోసం బంధువులు, మిత్రుల ఇళ్లలో వాకబు చేసినప్పటికీ ఆచూకీ దొరకలేదన్నారు. అదృశ్యమైన బంగారమ్మకు ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. బంగారమ్మ ఆచూకీ తెలిసినవారు పెందుర్తి పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

## ఘనంగా జగన్నాథుడి మారు రథయాత్ర

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఉక్కునగరం టౌన్‌షిప్‌లో జగన్నాథ స్వామి తిరుగు రథయాత్ర ఘనంగా జరిగింది. స్టీల్‌ప్లాంట్ కమర్షియల్ డైరెక్టర్ సతీమణి అంజుమహంతి, వి స్టీల్ మహిళా సమితితో కలిసి పాల్గొన్నారు. బలభద్రుడు సుభద్ర దేవి సమేత జగన్నాథస్వామి రథాన్ని ఊరేగించారు. వేలాదిమంది భక్తులు రథాన్ని లాగారు. రథ యాత్రలో భక్తులు, భజనలు నృత్యాలు చేశారు. పలువురు అధికారులు, ఉక్కునగరం చుట్టుపక్కల ప్రాంతాల భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

# ఏడు గ్రామాల్లో భూసమీకరణ

## జగనన్న ఇళ్ల స్థలాలకు ల్యాండ్ పూలింగ్

ప్రజాశక్తి - భీమునిపట్నం : జగనన్న ఇళ్ల స్థలాల కోసం ల్యాండ్ పూలింగ్ ద్వారా ఏడు గ్రామాల్లో భూసమీకరణ చేపడుతున్నట్లు తహశీల్దార్ కోరాడ వేణుగోపాల్ తెలిపారు. ఈ నెల 6న ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. ఈమేరకు దాకమర్రిలో 12 ఎకరాలు, నిడిగట్టులో 6.33 ఎకరాలు, అర్జైఅగ్రహారంలో 47.07 ఎకరాలు, నేరెళ్లవలసలో 31.55 ఎకరాలు, తాళ్లవలసలో 16.6 ఎకరాలు, చిప్పాడలో 16.61 ఎకరాలు భూ సమీకరణ చేయనున్నారు ల్యాండ్ పూలింగ్-2లో భాగంగా రైతుల ఆమోదంతోనే భూసమీకరణ చేపడతామని, ఈ మేరకు ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ఫారం-3 ద్వారా రైతులు అంగీకారం మేరకు ల్యాండ్ పూలింగ్ ద్వారా భూసేకరణ చేస్తామన్నారు. నిర్వాసితులకు ఎకరాకు 900 చదరపు గజాలు చొప్పున విఎంఆర్‌డిఎ అభివృద్ధి చేయనున్న లే అవుట్‌ల్లో స్థలాన్ని నిబంధనల మేరకు కేటాయిస్తారన్నారు సంబంధిత అసైన్డ్ భూముల్లో ల్యాండ్ పూలింగ్ చేపట్టి, లే అవుట్‌లు వేసేందుకు విఎంఆర్‌డిఎకు అప్పగిస్తామన్నారు.

# సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

శంకుస్థాపన చేస్తున్న రాజు

ప్రజాశక్తి- సీతమ్మధార: జివిఎంసి, 53వ వార్డు గ్రీన్‌గార్డెన్స్ హర్ష నగర్‌లో రూ.14లక్షల వ్యయంతో సిసి రోడ్ల నిర్మాణానికి వార్డు కార్పొరేటర్ బర్కత్ ఆలీ ఆధ్వర్యంలో ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ వార్డులో ఏ సమస్యలున్నా తన దృష్టికి తెస్తే పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీనిచ్చారు. కార్యక్రమంలో జివిఎంసిఇఇ శ్రీనివాస్, డిఇఇ భరణి, ఎఇఇ ఉష, తుళ్ళి చంద్రశేఖర్, షేక్ బాబ్జి, సదరం పాల్గొన్నారు.

# చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం

ఆర్థిక సాయం అందిస్తున్న సంస్థల ప్రతినిధులు

ప్రజాశక్తి -ఆనందపురం: చిన్నారి గుండె ఆపరేషనుకు స్వచ్ఛందసంస్థలు, దాతలు ముందుకొచ్చి రూ.26 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం టెక్కలికి చెందిన కోరాడ కృష్ణమూర్తి, సంధ్య దంపతులకు ఈనెల 16న పాప పుట్టింది. పుట్టుకతోనే పాప గుండెకు పేగులు అడ్డుపడడంతో నరసన్నపేట ప్రభుత్వాసుపత్రి, శ్రీకాకుళం కిమ్స్‌లో వైద్యానికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు ఆపరేషన్ అవసరమౌతుందని నిర్ధారించడంతో విశాఖ ఒమ్ని ఆసుపత్రిలో చేర్పించగా,ఈ నెల 24న అత్యవసరంగా గుండె ఆపరేషన్ చేయించారు. దీనికి రూ.మూడు లక్షలు అవసరం కావడంతో చిరువ్యాపారం చేస్తున్న కృష్ణమూర్తి అప్పుచేసి కొంత డబ్బులు చెల్లించాడు. మిగిలిన దానికి దాతల సాయాన్నిబాధిత తల్లిదండ్రులు అర్థించారు. దీనిపై స్పందించిన మండలంలోని గంభీరం గ్రామానికి చెందిన ఒఎన్‌జి ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ, స్నేహాంజలి ఫర్ పూర్ ఆర్గనైజేషన్, జియస్ ఫౌండేషన్, ఒఎన్‌జి ఫౌండేషన్ వ్యవస్థాపకులు దళాయి శివ మిత్ర బృందం సోషల్ మీడియా ద్వారా ప్రచారం నిర్వహించి, రూ. 26 వేల విరాళాలను సేకరించి పాప తల్లిదండ్రులకు అందజేశారు.

# పెరుగుతోన్న ఖాళీలతో కార్మికులపై పని భారం

## నూతన ఉద్యోగ నియామకాలు చేపట్టాలి : సిఐటియు

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్‌లో ప్రతినెలా పలువురు ఉద్యోగులు రిటైర్మెంట్ అవుతున్నారని, దానికి తగ్గట్టుగా ఉద్యోగ నియామకాలు చేపట్టాలని స్టీల్‌ప్లాంట్ సిఐటియు ప్రధాన కార్యదర్శి రామస్వామి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్ .రామారావు కోరారు. ఉద్యోగుల రిటైర్మెంట్‌కు తగ్గట్టుగా నియామకాలు చేపట్టక పోవడంతో ఖాళీలు గణనీయంగా పెరిగి, ఉన్నవారిపై పనిభారం పడుతోందన్నారు. బుధవారం సింటర్ ప్లాంట్ డిపార్ట్‌మెంట్ విభాగాధిపతితో సిఐటియు కమిటీ పరిచయం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ డిపార్ట్‌మెంట్‌లో క్లస్టర్ 'ఏ' నుంచి క్లస్టర్ 'బి'కి టెక్నీషియన్ ప్రమోషన్ అయిన కార్మికులను టెక్నీషియన్లుగా గుర్తించాలని కోరారు. వారి పని విధానాన్ని మార్చాలని విభాగాధిపతి ముఖర్జీకి వినతిపత్రం అందజేశారు. అనంతరం సిఐటియు కమిటీలో పనిచేసి ఉద్యోగ విరమణ చేస్తున్న ఉద్యోగులకు సిఐటియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వైటి దాస్, రామస్వామి, సీనియర్ నాయకులు ఎన్ .రామారావు సన్మానించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ, ఉత్పత్తికి ఆటంకం లేకుండా ఉద్యోగ నియామకాలు చేపట్టాలని

మాట్లాడుతున్న సిఐటియు నేత రామస్వామి

కోరారు. డిపార్ట్‌మెంట్ కార్యదర్శి ఎ.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిఐటియు విభాగ కమిటీ కెవి సత్యనారాయణ, పుల్లారావు ఉమామహేశ్వరరావు, డిఎస్ ఆర్‌సిహెచ్ మూర్తి, పట్నా రమేష్, కె.బాబూరావు, శంకర్, సత్యనారాయణ, రామారావు, డి. సింహాచలం, త్రిమూర్తి బాబు, పి. రామారావు, వైవి రమణ, పణీంద్రకుమార్, ఈశ్వరరావు, ప్రసాద్ , పద్మారావు, వై.నూకరాజు, లింగేశ్వరరావు, దుర్గారావు, పద్మారావు, కృష్ణారావు, కె.అప్పారావు పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత

## అమ్మఒడి సాయం పంపిణీలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- ఆనందపురం: కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను తయారు చేయడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఆనందపురం జెడ్‌పి హైస్కూల్‌లో అమ్మఒడి నాలుగోవిడత పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలో నాలుగో విడతలో 6263 మంది విద్యార్థులకు రూ.8.14 కోట్ల అమ్మఒడి సాయాన్ని విద్యార్థుల తల్లులు ఖాతాలో నేరుగా జమ చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో తహశీల్దార్ లోకవరపు రామారావు, ఎంపిడిఒ అడప లవరాజు, ఎంఇఒ పద్మావతి, గంగరాజు, ఎంపిపి మజ్జి శారద ప్రియాంక, జెడ్‌పిటిసి కోరాడ వెంకటరావు, వైస్ ఎంపిపి పాండ్రంకి శ్రీను,కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపల్ చంద్రకళ, స్థానిక సర్పంచ్ లంక లావణ్య, ఎంపిటిసి పల్లా దుర్గ, వైసిపి మండల అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, కాకర్లపూడి వరహాలరాజు, శ్రీకాంత్, లెంక రాంబాబు, పల్లా రమణ పాల్గొన్నారు.

పిఎం.పాలెం : చంద్రంపాలెం పాఠశాల వేదికగా అమ్మఒడి ఆర్థికసాయం నాలుగో విడత పంపిణీని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించారు. మధురవాడ జోన్ పరిధిలోని నాలుగు వార్డులకు సంబంధించి 13,822 మంది లబ్ధిదారులకు

చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

రూ.3 కోట్ల 60 లక్షలు అమ్మఒడి సాయాన్ని నేరుగా విద్యార్థుల తల్లిదండ్రులు ఖాతాల్లోకి డబ్బులు జమ చేస్తామన్నారు. వాటిని సద్వినియోగం చేసుకొని మంచి క్రమశిక్షణతో పిల్లలను చదివించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కె కనకమహాలక్ష్మి, నగరాల కార్పొరేషన్ చైర్మన్ పిల్లా సుజాత సత్యనారాయణ, హెచ్‌ఎం ఎం రాజాబాబు, వార్డుల వైసిపి అధ్యక్షులు పోతిన హనుమంతరావు, బొట్ట అప్పలరాజు, పోతిన శ్రీనివాస్, పోతిన ఎల్లాజీ, పోతిన ప్రసాద్, గాదె రోశిరెడ్డి, పిల్లా రమణబాబు, గుంటుబోయిన సంజీవ్‌యాదవ్, పిల్లా కృష్ణమూర్తి పాత్రుడు, పిల్లా సూరిబాబు, వాండ్రాసి రవికుమార్, జగపిల్లి నరేష్, కురిటి వెంకటలోహిత్, కొండపల్లి వరలక్ష్మి పాల్గొన్నారు.

# కాంట్రాక్టు కార్మికుల ఎక్స్‌గ్రేషియా పెంపు

## రూ.ఐదు లక్షల నుంచి రూ.11 వేలకు పెంచుతూ ఒప్పందం

యాజమాన్యంతో కాంట్రాక్టు కార్మికుల ఒప్పందం

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల ఎక్స్‌గ్రేషియాను రూ. ఐదు లక్షల నుంచి రూ.11 లక్షలకు పెంచుతూ రీజనల్ లేబర్ కమిషనర్ సమక్షంలో అఖిలపక్ష కార్మిక సంఘాలతో ఉక్కు యాజమాన్యానికి ఒప్పందం జరిగింది. లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో అఖిలపక్ష కార్మిక సంఘాలతో యాజమాన్యంజరిపిన చర్చల్లో ఎట్టకేలకు ఒప్పందం జరిగినట్లు కార్మిక నేతలు తెలిపారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నేతలు మాట్లాడుతూ. 13ఏళ్లగా కావాలనే కాలయాపన జరిగి, ఎట్టకేలకు ఒప్పందం కుదరడం కార్మిక విజయమన్నారు. ఈ ఒప్పందం మరో ఐదేళ్ల కాలపరిమితి ఉంటుందన్న యాజమాన్యం వాదనను తిప్పికొట్టారు. మరో నాలుగేళ్ల తర్వాత ఎక్స్‌గ్రేషియాపై డిమాండ్ చేయడానికి అంగీకరింపచేశామన్నారు. ఒప్పందంలో ఆర్‌ఎల్‌సి మహంతి, యాజమాన్యం నుంచి జిఎం (హెచ్‌ఆర్) బినయ్ ప్రసాద్, డిజిఎం (హెచ్‌ఆర్) సుబేందు కర్. యూనియన్ నాయకులు. ఒవి రావు, జె శ్రీనివాసరావు, మంత్రి రవి, నందికి తాతారావు, బొడ్డ గోవింద్, పిట్ట రెడ్డి, భాస్కరరావు, అవతారం, బొడ్డు పైడిరాజు, రాజేష్, సత్యారావు, నాయుడు, ఉమ్మిడి అప్పారావు, నారాయణ, కృష్ణ, కెపి సుబ్రమణ్యం, ధర్మాల రామిరెడ్డి పాల్గొన్నారు.

## జిఐ 301 హౌస్‌కమిటీ పట్టాదారులకు

# కన్వెన్షన్ డీడ్ మంజూరుకు కసరత్తు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక హౌస్ కమిటీ పరిధిలో జిఒ.301 ద్వారా పట్టాలు పొందిన వారందరికీ వారం రోజుల్లో కన్వెన్షన్ డీడ్ ఇవ్వడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి గాజువాక తహసిల్దార్ కార్యాలయానికి కన్వెన్షన్ డీడ్ సంబంధించి సమాచారం వచ్చింది. దీనిపై రెవెన్యూ అధికారులు ఈ పట్టాలపై గతంలో క్రమబద్ధీకరణ కొరకు చెల్లించిన రుసుముపై, 7.5 శాతం , 200 రూపాయల యూజర్ ఛార్జీలు చెల్లిస్తే కన్వెన్షన్ డీడ్ రిజిస్ట్రేషన్ జరుగుతుందని పట్టాదారులందరికీ అధికారులు తెలియజేస్తున్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ఈ పట్టాల జిరాక్స్ కాపీలు తీసుకువచ్చే పనిలో వాలంటీర్లు ఉన్నారు. మార్కెట్ విలువ ఆధారంగా కాకుండా ఈ విధంగా రిజిస్ట్రేషన్ జరిగితే కొంతవరకు ఆర్థిక భారం తగ్గుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# జూ పార్కును సందర్శించిన రాష్ట్ర డైరెక్టర్

జూ పార్కును పరిశీలిస్తున్న రాష్ట్ర డైరెక్టర్ శాంతిప్రియ పాండే

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలను అడిషనల్ పిసిసిఎఫ్ (వైల్డ్‌లైఫ్), రాష్ట్ర జూ డైరెక్టర్, శాంతిప్రియ పాండే బుధవారం సందర్శించారు. జూపార్కులోని జంతువులు, పక్షుల ఎన్‌క్లోజర్లను పరిశీలించారు. జూలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూశారు. ఇటీవల జూ పార్కుకు వచ్చిన కొత్త జంతువుల కదలికలను, వాటి ఆరోగ్యపరిస్థితిని జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియాను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల జూపార్కులో జంతువులు వరుస మరణాలకు గల కారణాలపై ఆరా తీశారు. జూలోని జంతువులు, పక్షుల ఆరోగ్య పరిస్థితిపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# నేడు విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చు

ప్రజాశక్తి -మధురవాడ : ఎపిఇపిడిసిఎల్ మధురవాడ మూడో జోన్ పరిధిలోని అన్ని రెవెన్యూ కార్యాలయాల్లో విద్యుత్ బిల్లులు వసూళ్ల కౌంటర్లు గురువారం బక్రీద్ రోజున యథావిధిగా పని చేస్తాయని మూడో జోన్ ఆపరేషన్స్ డిఇఇ పి.శ్రీనివాసరావు తెలిపారు.

# జగనన్న సురక్షతో అర్హులకు లబ్ధి

మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-సీతమ్మధార :రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న జగనన్న సురక్ష ద్వారా మిగిలి ఉన్న అర్హులందరికీ సంక్షేమ లబ్ధి చేకూరనుందని, జివిఎంసి ఫ్లోర్‌లీడర్, 44వ వార్డు కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావు సూచించారు బుధవారం వార్డు పరిధిలోని 243, 244, 245 సచివాలయాల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలన్నీ అమలు చేసి, 90శాతానికి పైగా లబ్ధి చేకూర్చిందని, మిగిలిన 10శాతం మందికి ప్రభుత్వ పథకాలను అందించడమే ఈ పథకం లక్ష్యమన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి, వారితో దరఖాస్తు చేయించడం ద్వారా లబ్ధి చేకూర్చాలన్నారు. కార్యక్రమంలో వార్డు వైసిపి యువ నేత బాణాల తరుణ్‌కుమార్, ట్రైనింగ్ క్యాంప్ నిర్వాహకులు సందీప్, మాజీ కార్పొరేటర్ బులుసు జగదీష్, గోపి వెంకట్, కన్వీనర్లు, గృహసారథులు, వాలంటీర్లు పాల్గొన్నారు

# అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి

## సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకరరావు

ప్రజాశక్తి- కె.కోటపాడు

అంగన్వాడీ వర్కర్లు, మినీ వర్కర్లు, ఆయాల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు రుత్తల శంకరరావు డిమాండ్ చేశారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయ ఆవరణలో ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు జి.కుమారి అధ్యక్షతన బుధవారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో శంకరరావు మాట్లాడుతూ తెలంగాణ కన్నా అదనంగా వెయ్యి రూపాయలు జీతం ఇస్తామని పాదయాత్రలో ఇచ్చిన హామీని నేటికీ జగన్మోహన్‌రెడ్డి అమలు చేయలేదని తెలిపారు. అంగన్వాడీ వర్కర్లు గ్రాట్యుటీకి అర్హులని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా దానిని వర్తింపజేయడం లేదన్నారు. 2017 నుండి టిఎ, డిఎలు చెల్లించడం లేదని, సొంత డబ్బులు వెచ్చించి సమావేశాలకు రావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలని, ప్రభుత్వమే గ్యాస్ సరఫరా చేయాలని, 300 జనాభా దాటిన మినీ అంగన్వాడీలను మెయిన్ అంగన్వాడీలుగా గుర్తించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రమోషన్లు వెంటనే కల్పించాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు ఇవ్వాలని కోరుతూ జులై 10, 11 తేదీల్లో జరుగు ధర్నాల్లో అంగన్వాడీలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సిడిపిఒ మంగతాయారుకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు వరలక్ష్మి, అమ్మాజీ, భవాని తదితరులు పాల్గొన్నారు.

సిడిపిఒకు వినతిపత్రం ఇస్తున్న అంగన్వాడీ నేతలు



ఈ స్టాంపులు అందిస్తున్న దృశ్యం

## ఈ-స్టాంప్ కౌంటర్ ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ-స్టాంప్ కౌంటర్‌ను సబ్ రిజిస్ట్రార్లు ఎవిఎస్ఎన్.మూర్తి, వి.బసవేశ్వరరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ వ్యవహారాలకు సంబంధించిన స్టాంప్ డ్యూటీ, ఈ స్టాంపింగ్ పేపర్ ద్వారా పొందవచ్చన్నారు. నకిలీ విక్రయాలను అధిగమించేందుకు ఈ స్టాంప్ వినియోగం చక్కని పరిష్కారమని పేర్కొన్నారు. అగ్రిమెంట్లు, బ్యాంకులోన్ అగ్రిమెంట్, రిజిస్ట్రేషన్లకు స్టాంప్ డ్యూటీ ఈ స్టాంప్ పేపర్ ద్వారా కూడా పొందవచ్చన్నారు. నాన్ జ్యుడీయల్ స్టాంపులను ఆన్లైన్ విధానంలో పారదర్శకంగా అందజేయడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ల కార్యాలయ సిబ్బంది, కామన్ సర్వీస్ సెంటర్ విఎల్ఇ వి.వెంకట రాము పాల్గొన్నారు.

పివి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బుద్ద రాజేష్

## మాజీ ప్రధాని పివికి ఘన నివాళి

ప్రజాశక్తి-అనకాపల్లి

మాజీ ప్రధాన మంత్రి పివి నరసింహారావు జయంతి వేడుకలను ఉత్తరాంధ్ర చర్చా వేదిక యువజన కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. వేదిక నాయకులు బుద్ద రాజేష్ పివి నరసింహారావు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ భారతదేశానికి తెలుగువాడు ప్రధానిగా కావడం గర్వించదగ్గ విషయమన్నారు. పీవీ నరసింహారావు ప్రధాని అయ్యే నాటికి భారతదేశం చాలా క్లిష్టమైన పరిస్థితిలో ఉందని, ఆ సమయంలో ఆర్థికవేత్తగా ఉన్న మన్మోహన్ సింగ్‌ను పీవీ ఆర్థిక మంత్రిని చేసి దేశానికి గాడిలో పెట్టారని తెలిపారు. నేడు భారతదేశం ప్రపంచ దేశాలతో పోటీపడుతుందంటే ఆనాడు పీవీ నరసింహారావు తీసుకువచ్చిన ఆర్థిక సంస్కరణలే కారణమని చెప్పారు. ఆయన జీవిత చరిత్రను ఎపిలోని పాఠ్యపుస్తకాల్లో ప్రచురించాలని, ఏదో ఒక జిల్లాకు పీవీ నరసింహారావు పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బొడ్డేడ వెంకట్రావు, బుద్ద మహాలక్ష్మి నాయుడు, లంకెలపల్లి సూర్యనారాయణ, ద్రాక్షారపు పరదేశి నాయుడు, బోడి రమణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

**కలెక్టరేట్, విశాఖ** : భారత మాజీ ప్రధాని కీర్తిశేషులు పివి.నరసింహారావు 103వ జయంతిని బుధవారం నగరంలో ఘనంగా నిర్వహించారు. గవర్నర్ బంగ్లా వద్ద గల పివి.నరసింహారావు విగ్రహానికి వైజాగ్ బ్రాహ్మణ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యాన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్రా యూనివర్సిటీ మాజీ రెక్టార్ ఆచార్య ఎ.ప్రసన్నకుమార్ మాటాడుతూ, పివి.నరసింహారావు ప్రధానమంత్రిగా దేశానికి గొప్ప సేవలందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ద్రోణంరాజు శ్రీవత్సవ పల్లా దుర్గారావు, 30 వ వార్డు కార్పొరేటర్ అప్పల రత్నం, వైజాగ్ బ్రాహ్మణ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు కావురు చరణ్‌కుమార్, న్యాయవాది కె.వి రామమూర్తి, విశ్రాంత పోలీస్ అధికారి ఎస్.దివాకర్, కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం ట్రస్టీ నండూరి సుబ్రమణ్యం, శంకర్ నీలు తదితరులు పాల్గొన్నారు.

నగర కాంగ్రెస్ ఆధ్వర్యాన పివి.నరసింహారావు విగ్రహానికి పార్టీ నగర అధ్యక్షుడు గొంప గోవిందరాజు, రాష్ట్ర కార్యదర్శి సోడదాసి సుధాకర్, బీసీ సెల్ చైర్మన్ చంద్రబాబు, యువజన కాంగ్రెస్ కార్యదర్శి రామకృష్ణ, కస్తూరి వెంకటరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## ఎన్‌టిపిసి వద్ద నిరసన

ప్రజాశక్తి - పరవాడ : ఎన్టిపిసి సింహాద్రి కార్మికులకు స్పెషల్ అలవెన్స్ వర్తింప చేయాలని కోరుతూ బుధవారం బిఎంఎస్, టిఎన్‌టియుసి ఆధ్వర్యంలో ఎన్టీపీసీ ప్రధాన ద్వారం వద్ద కార్మికులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు మానవరపు అప్పలనాయుడు, మళ్ల జగదీశ్వరరావు, ఎల్ ప్రసాద్, బి రమణ, సతీష్, కుంచరాజు అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఛార్జీల పెంపునకు వ్యతిరేకంగా

# 30న సబ్ స్టేషన్ల వద్ద ధర్నాలను జయప్రదం చేయండి

## సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి లోకనాథం పిలుపు

ప్రజాశక్తి- అనకాపల్లి

ట్రూఅప్ ఛార్జీలు, సర్దుబాటు ఛార్జీలు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు పేరుతో దొడ్డిదారిన విద్యుత్ వినియోగదారులపై పెద్ద ఎత్తున భారాలను వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఈ నెల 30న విద్యుత్ సబ్ స్టేషన్ల వద్ద వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో జరిగే నిరసనల్లో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ విజ్ఞప్తి చేస్తోంది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కె.లోకనాథం బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ భారాలు మోపనని చెప్పిన జగన్మోహన్‌రెడ్డి ఇప్పటి వరకు సుమారు రూ.50వేల కోట్ల భారాలను ప్రజలపై మోపారని తెలిపారు. కేంద్రప్రభుత్వానికి సిఎం జగన్ సాగిలపడి ప్రజలపై విద్యుత్ భారాలు వేస్తున్నారని, బిజెపి పాలిత రాష్ట్రాలే అమలు చేయని విద్యుత్ సంస్కరణలు, ప్రైవేటీకరణ విధానాలను మన రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం అమలు చేస్తోందని పేర్కొన్నారు. ప్రపంచ బ్యాంకు షరతులకు చంద్రబాబు తలొగ్గి విద్యుత్ సంస్కరణలు అమలు చేస్తే, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం షరతులకు జగన్ తల్లొడం సిగ్గుచేటన్నారు. మోడీ, జగన్ కలిసి కొత్త రూపాల్లో భారాలు మోపుతూ ప్రజల నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. విద్యుత్ ఛార్జీల భారం భరించలేక చిన్న పరిశ్రమలు, పెద్ద ఎల్లాయిస్ పరిశ్రమలు మూతపడే పరిస్థితి వచ్చిందని, చేతివృత్తిదారులు దివాళా తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్మార్ట్ మీటర్ల పేరుతో రూ.17వేల కోట్ల భారాలు ప్రజలపై మోపుతున్నారన్నారు. చండీఘర్, రాజస్థాన్ రాష్ట్రాల్లో రూ.10వేల లోపు ఉన్న స్మార్ట్‌మీటర్‌ను మన రాష్ట్ర ప్రభుత్వం రూ.37వేలతో ఎందుకు కొనుగోలు చేస్తుందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్ ధరలు రోజువారీ ఎలా పెంచుతున్నారో, విద్యుత్ ఛార్జీలు కూడా అలాగే వేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చూస్తోందని తెలిపారు. ప్రారంభంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలని ప్రజలకు లోకనాథం పిలుపునిచ్చారు.

## అగ్రిగోల్డ్ బాధితులు పోరాటానికి సిద్ధం కావాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : అగ్రిగోల్డ్ బాధితుల సమస్య పరిష్కారానికి బాధితులు, ఏజెంట్లు పోరాటానికి సిద్ధం కావాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో బుధవారం కర్రి మాణిక్యాలరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ తాము అధికారంలోకొస్తే ఆరు నెలల్లో మొత్తం ఖాతాదారులందరికీ డిపాజిట్లు చెల్లిస్తామని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీని నేటికీ నెరవేర్చలేదన్నారు. అరకొర చెల్లింపులు చేసి సమస్యను గాలికి వదిలేయడంతో వందల సంఖ్యలో బాధితులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు వైఎన్.భద్రం, మొల్లేటి గోపాల రమణ, జెర్రిపోతుల దుర్గారావు, పోలమరశెట్టి శేషు, సి.హెచ్.మోహన్‌రావు, ఎవి నర్సమ్మ, సూరిబాబు, నరసింహమూర్తి పాల్గొన్నారు.

## మళ్లీ పెరిగిన ఎండ తీవ్రత

ప్రజాశక్తి - కశింకోట : ఎండ తీవ్రత మళ్లీ పెరిగింది. కశింకోట మండలంలో బుధవారం ఉష్ణోగ్రత పెరగడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. గత మూడు రోజులుగా వాతావరణం చల్లగా ఉండగా, బుధవారం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. దీంతో విద్యార్థులు, వృద్ధులు చెట్టు నీడని ఆశ్రయించారు.

# పోలవరం పోరుకేకకు విరాళాల సేకరణ

సబ్బవరంలో విరాళాలు సేకరిస్తున్న సిపిఎం నేతలు ప్రభావతి తదితరులు

ప్రజాశక్తి- సబ్బవరం

పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం సిపిఎం చేపట్టిన పోరుకేక మహాపాదయాత్ర నిర్వహణకు విరివిగా విరాళాలు ఇచ్చి ఆదుకోవాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బి.ప్రభావతి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సిపిఎం ఆధ్వర్యాన విరాళాలు సేకరణ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని, పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఉప్పాడ సత్యవతి, నాయకులు మొల్లేటి గౌరీశ్వరరావు, కన్నేపల్లి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**తగరపువలస** : సిపిఎం ఆధ్వర్యంలో పోరుకేక మహా పాదయాత్ర చేపడుతున్న పోలవరం నిర్వాసితులకు మద్దతుగా బుధవారం సిపిఎం భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక మెయిన్ రోడ్డులో విరాళాల సేకరణ చేపట్టారు. జోన్ కార్యదర్శి రవ్వ నరసింగరావు ఆధ్వర్యంలో పార్టీ నేతలు భాగం లక్ష్మి, ఎస్ శ్రీనివాసవర్మ తదితరులు పలు దుకాణ యాజమానుల నుంచి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా కరపత్రాలు పంపిణీ చేశారు. పోలవరం నిర్వాసితులకు పునరావాసం, పరిహారం పూర్తిగా చెల్లించాలని, అంతవరకు ముంపు గ్రామాల్లో సౌకర్యాల కల్పన, సంక్షేమ కార్యక్రమాలు యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు మండలాన్ని యూనిట్‌గా తీసుకుని అర్హులందరికీ ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, పరిహారం ఇవ్వాలని కోరారు. సంఘీభావ నిధుల సేకరణకు సహకరించిన వారందరికీ కతజ్ఞతలు తెలిపారు.

తగరపువలసలో విరాళాలు సేకరిస్తున్న దృశ్యం

## వైసిపి జిల్లా అధ్యక్షునిగా బొడ్డేడ నియామకంపై హర్షం

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : వైసీపీ జిల్లా అధ్యక్షునిగా గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్‌ను నియామకం పట్ల ఆ పార్టీ మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని ప్రసాద్ క్యాంప్ కార్యాలయంలో బుధవారం వేడుకలు నిర్వహించారు. స్వీట్లు పంచుకుని ఆనందాన్ని వ్యక్తపరిచారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిరసపల్లి ఎంపీటీసీ సభ్యులు మద్దాల వీరునాయుడు మాట్లాడుతూ ప్రసాదును పార్టీ జిల్లా అధ్యక్షులుగా నియమించినందుకు ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు దిమ్మల అప్పారావు, బీసెట్టి గంగ అప్పలనాయుడు, బొడ్డేడ శ్రీనివాసరావు, వైసీపీ నాయకులు శరగడం జగన్నాధరావు, ఆడారి లక్ష్మణరావు, కోయిలాడ దశావతారం పాల్గొన్నారు.

సిఎం జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న వైసిపి నేతలు

వినతిపత్రం ఇస్తున్న విఆర్ఎ సంఘం నాయకులు

## అక్రమంగా విఆర్ఎల నియామకాన్ని ఆపాలని వినతి

ప్రజాశక్తి- కశింకోట : నోటిఫికేషన్ లేకుండా అక్రమంగా విఆర్ఎల నియామకాన్ని వెంటనే నిలుపుదల చేయాలని ఎపి విఆర్ఎల సంఘం (సిఐటియు) నాయకులు బుధవారం తహశీల్దారు జి .సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. కసింకోటలో, బయ్యవరం, కన్నూరుపాలెం గ్రామాలలో విఆర్ఎలు ప్రమోషన్లతో విఆర్ఓలు వెళ్లడంతో ఖాళీ అయిన వీఆర్ఏ పోస్టులకు ప్రభుత్వం ఎటువంటి నోటిఫికేషన్ జారీ చేయలేదని పేర్కొన్నారు. అయినా ఖాళీ అయిన స్థానాలలో తమ ఇష్టం వచ్చిన వారిని విఆర్ఏలుగా అధికారులు నియమించారని, వాటిని నిలుపుదల చేయాలని కోరారు. అలాగే చనిపోయిన ఏడుగురు విఆర్ఎల కుటుంబాలకు ఇప్పటివరకు గ్రాట్యుటీ ఇవ్వలేదని తెలిపారు. దీనికి స్పందించిన తహశీల్దారుర సమస్యను పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు రవికుమార్, ప్రధాన కార్యదర్శి గంగాధర్, గౌరవాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు అప్పారావు, దాకారపు శ్రీనివాసరావు, లోవరాజు, శ్రీనివాసరావు, రత్నం, దుర్గంబ ,రేవతి, పాల్గొన్నారు.

## దొడ్డి అప్పారావుకు నివాళి

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక ప్రశాంతి నికేతన్ పాఠశాల వ్యవస్థాపకులు దొడ్డి అప్పారావు మాస్టర్ వర్ధంతిని బుధవారం ఆ స్కూల్ ఆవరణలో నిర్వహించారు. స్కూల్ కరెస్పాండెంట్ డివి.శ్రీనివాసరావు అప్పారావు మాస్టర్ చిత్ర పటానికి పూలమాలను వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 33 ఏళ్ల క్రితం విద్యా సంస్థలు ప్రారంభించి ఎంతోమంది విద్యార్థులను ఉన్నతమైన విద్యార్థులుగా తీర్చిదిద్దారని గుర్తుచేశారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా విద్యాసంస్థలను నడుపుతామని చెప్పారు. కార్యక్రమంలో స్కూల్ అగనంపూడి బ్రాంచి కరెస్పాండెంట్ డి.చంద్రశేఖర్, స్కూల్ ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కశింకోట నూరి మసీద్ పాలకవర్గ నియామకం

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట నూరి మసీద్ నూతన కమిటీని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు బుధవారం నియమించింది. కమిటీ అధ్యక్షులుగా రహీం తుల్లా, ఉపాధ్యక్షులుగా డి.కరీముల్ రెహమాన్ (బాబర్), కార్యదర్శిగా ఎంఎం.అలీ, కోశాధికారిగా అబ్దుల్ రజాక్, సభ్యులుగా మహమ్మద్ అబ్దుల్ రబ్బానీ, సయ్యద్ రహ్మతుల్లా బోకారీ, మహమ్మద్ ఇమ్తియాస్ షరీఫ్, అబ్దుల్ రషీద్ ఖాన్, మహమ్మద్ అహ్మద్ హుస్సేన్, సయ్యద్ మహబూబ్ సుభానీ, షేక్ పీర్ సాహెబ్ తదితర 11 మంది సభ్యులుగా నియమించారు. ఈ పాలకవర్గం కాల పరిమితి రెండు సంవత్సరాలు ఉంటుంది. మసీదు అభివృద్ధికి కృషి చేస్తామని నూతన కమిటీ తెలిపింది.

## సంస్కృతి గ్లోబల్ స్కూల్‌లో విద్యార్థి సంఘం ఎన్నిక

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్‌లో విద్యార్థుల సంఘం ఎన్నికలు నిర్వహించారు. హెడ్ బాయ్‌గా కార్తీక్, హెడ్ గర్ల్‌గా అనుశ్రీ, హౌస్ కెప్టెన్‌లుగా సరయు, ధ్రువన్, చార్మిత ధార్మిక ఎన్నికయ్యారు. వీరు బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. ఇందులో పాల్గొన్న పాఠశాల డైరెక్టర్ పి.ఉదయనాగశ్రీ మాట్లాడుతూ సంప్రదాయ విద్యా సంస్థలలో విద్యార్థులందరూ కేవలం హక్కులు గురించే కాకుండా వారి బాధ్యత పట్ల నమ్మకం సృష్టించి, దూరదృష్టి గల విద్యార్థులను తయారు చేయుటకు ప్రజాస్వామ్యం విధానంలో విద్యార్థి సంఘంను ఎంపిక చేయడం జరుగుతుందని చెప్పారు. స్కూల్ స్థాయి నుండి నాయకులుగా ఎదగడం నేర్చుకోవడం ముఖ్యమని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి, సీఈవో నిశాంత్, కోఆర్డినేటర్ రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికైన విద్యార్థి సంఘం నాయకులు

# రైతుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి

రైతాంగ సమస్యలను పరిష్కారం చేయాలని కోరుతూ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనితకు ఏపీ రైతు సంఘం బుధవారం వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తొలకరి ప్రారంభమైందని, అయినా రైతులకు ఇంతవరకు వరి విత్తనాలు అందుబాటులో లేక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే జిల్లాలోని అన్ని రైతు భరోసా కేంద్రాలు ద్వారా వరి విత్తనాలు అందించాలన్నారు. 2022 నవంబర్, డిసెంబర్, 2023 ఏప్రిల్, మే నెలలో కురిసిన వర్షాల వల్ల పంటలు దెబ్బతిన్న రైతులకు నష్ట పరిహారం, పంటల బీమా ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెరిగిన ఉత్పాదక ఖర్చులతో కలిపి అదనంగా 50శాతంతో కేంద్రం మద్దతు ధరలను ప్రకటించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ 2022 విద్యుత్ సంస్కరణ చట్టం రద్దు చేయాలని, వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టే కార్యక్రమాన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో మూసి వేసిన తాండవ, ఏటికొప్పాక సుగర్ ఫ్యాక్టరీలను తెరిపించి, ఆధునీకరించి నడిపించాలని, గోవాడ సుగర్ ఫ్యాక్టరీ రైతులకు బకాయిలు చెల్లించాలని, తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ ఆస్తుల వేలం వేసే ఆలోచన విరమించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.అప్పారావు, ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, జిల్లా కోశాధికారి జి.నాయనబాబు, నాయకులు బి.రంగారావు, కె.సత్యనారాయణ, ఎ.అప్పలరాజు, బి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

# పాడి రైతుల సంక్షేమమే విశాఖ డెయిరీ ధ్యేయం

అధిక పాలు సరఫరా చేసిన వ్యక్తికి బహుమతి అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - కె.కోటపాడు

పాడి రైతుల సంక్షేమమే ధ్యేయంగా విశాఖ డెయిరీ పనిచేస్తుందని డెయిరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్ అన్నారు. మండలంలోని చౌడువాడ పాల సేకరణ కేంద్రం వద్ద సొసైటీ సర్వసభ్య సమావేశం అధ్యక్షులు కుమార వెంకటరమణ ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న గంగాధర్ మాట్లాడుతూ విశాఖ డెయిరీ రైతులకు అధిక ధర ఇచ్చి ప్రోత్సహిస్తుందని చెప్పారు. ఎన్ని ప్రైవేటు డెయిరీలు పుట్టుకొచ్చిన విశాఖ డెయిరీకి సరి సమానం కాదన్నారు. చౌడువాడ పాల కేంద్రం వద్ద రోజుకు 3,200 లీటర్ల పాలు 586 రైతుల నుండి సేకరిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఇటీవలే మృతి చెందిన 8 పశువులకు పశు బీమా సొమ్ము బాధిత రైతులకు, ఇటీవల మరణించిన 11 మంది రైతుల కుటుంబాలకు రైతు బీమా సొమ్ము అందజేశారు. నాణ్యమైన అధిక గేద పాలు సరఫరా చేసిన ముగ్గురు రైతులకు, నాణ్యమైన అధిక ఆవుపాలు సరఫరా చేసిన ముగ్గురు రైతులకు బహుమతుల ప్రదానం చేశారు. అనంతరం పిఎస్ చిన్ని వెంకట నరసింహమూర్తి ఈ ఆర్థిక సంవత్సరంలో సొసైటీ నిర్వహించిన కార్యక్రమాల నివేదికను చదివి వినిపించారు. నూతనంగా ఎన్నికైన డైరెక్టర్లు శిల్పరశెట్టి వెంకటరావు, గొలగాన నాగేశ్వరరావు చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దాడి ఎరుకు నాయుడు, గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మాజీ డైరెక్టర్ రాజి శ్రీనివాసరావు, సొసైటీ మాజీ అధ్యక్షులు కుమార ఎర్రనాయుడు, మాజీ డైరెక్టర్ శిల్పరశెట్టి రమణబాబు, వార్డు మెంబరు రాపేటి ప్రసాదు, డైరెక్టర్లు, సభ్యులు పాల్గొన్నారు.

## సంగీతంతో మానసిక ఉల్లాసం

ప్రజాశక్తి-కె.కోటపాడు : సంగీతం వల్ల మానసిక ఉల్లాసంతో శారీరకంగా ఆరోగ్యం మెరుగుపడుతుందని ఎంపీడీవో కె.శచీదేవి అన్నారు. అయ్యన్న విద్యాసంస్థల స్కూల్ ప్రాంగణంలో ఈ విద్యా సంవత్సరం నుంచి నూతనంగా ఏర్పాటు చేసిన "మ్యూజిక్ క్లాస్ రూమ్"ను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి రోజుల్లో విద్యార్థులు చదువుతోపాటు సంగీతాన్ని కూడా నేర్చుకోవాల్సిన ఆవశ్యకత ఉందని చెప్పారు. అయ్యన్న విద్యాసంస్థల అధినేత డాక్టరు ఖాశిం మాట్లాడుతూ విద్యార్థులలో ఉన్న కళా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ప్రత్యేకంగా సంగీత తరగతులను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టరు నూర్జహాన్, సంగీత ఉపాధ్యాయురాలు మల్లాది సమీరా, స్కూల్ ప్రిన్సిపాల్ హరీష, ఉపాధ్యాయుడు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌సి వర్గీకరణపై మాటతప్పిన పార్టీలు

ప్రజాశక్తి-చోడవరం : ఎస్సీ వర్గీకరణపై అన్ని పార్టీలు మాట తప్పాయని, వర్గీకరణకు కట్టుబడి ఉన్న మహజన సోషలిస్టు పార్టీకి మాదిగలు ఓట్లు వేయాలని ఎమ్మార్పీఎస్ ఉత్తర ఆంధ్ర కోస్తా జిల్లాల కన్వీనర్ ముమ్మిడివరపు చిన సుబ్బారావు మాదిగ అన్నారు. బుధవారం చోడవరం ఇందిరా కాలనీలో ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో చలో హైదరాబాద్ సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో దాదాపుగా 8 శాతం పైగా ఉన్న మాదిగలను అన్ని రాజకీయ పార్టీలు కేవలం ఓటు బ్యాంకు గానే పరిగణిస్తున్నాయని విమర్శించారు. 2024లో సార్వత్రిక ఎన్నికల్లో అన్ని పార్టీలను మట్టికరిపించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ఎలక మల్లిబాబు, మోర్తా శ్రీనివాసరావు, మల్లిపూడి సత్యనారాయణ తత్తర మోడీ శ్రీనివాసరావు, ఉప్పాటి ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బీమా పథకాలపై మహిళలకు అవగాహన

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం ఎపి గ్రామీణ వికాస్ బ్యాంకు బ్రాంచ్‌లో స్వయం సహాయక సంఘాల సభ్యులకు ప్రధానమంత్రి జీవన జ్యోతి యోజనా, సురక్ష బీమా యోజన గురించి బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల మహిళా సమాఖ్య ఎపిఒ ఎమ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ బీమా ఉంటే ధీమాగా ఉండవచ్చన్నారు. బ్యాంక్‌లో అకౌంట్ ఉన్న వారందరూ రూ.456 కట్టి బీమా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీసీ రామకృష్ణ, విఒఎ భవాని పాల్గొన్నారు.

## వైసిపి పాలనలో విద్యా రంగం నిర్వీర్యం

ప్రజాశక్తి-అనకాపల్లి : జగన్మోహన్ రెడ్డి పాలనలో విద్యారంగం నిర్వీర్యం అయిందని మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ ఆరోపించారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం అమలు చేయాలని, ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. వైసిపి నాయకుల కోసమే జగన్‌రెడ్డి నాడు- నేడు పథకం ప్రారంభించారని విమర్శించారు. పార్టీ నాయకులు కొణతాల శ్రీనివాసరావు, కర్రి బాబీ, కొణతాల రత్న కుమారి, సత్యనారాయణ, శ్రీకాకుళం గణపతి పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

## పశువుల ఆసుపత్రి భవనానికి శంకుస్థాపన

ప్రజాశక్తి -వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది పశువుల ఆసుపత్రికి నూతన భవనం నిర్మాణానికి వడ్డాది పిఎసిఎస్ ఛైర్‌పర్సన్ దొండా సన్యాసిరావు బుధవారం చేశారు. పశువుల ఆసుపత్రి భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో స్థానిక నాయకులు, పశువైద్య అధికారి డాక్టర్ శివకుమార్ ఈ సమస్యను విశాఖ డెయిరీ ఛైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన నూతన భవన నిర్మాణానికి రూ.10లక్షలు మంజూరు చేశారు. తొలివిడతగా విడుదల చేసిన రూ.5లక్షలు చెక్‌ను బుధవారం విశాఖ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ శివకుమార్‌కు అందచేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి దొండా రాంబాబు, వైస్ ఎంపిపి దొండా లలితా నారాయణ మూర్తి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్షయ రోగులకు పౌష్టికాహారం కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని తగరంపూడి పిహెచ్సీ పరిధిలో చికిత్స పొందుతున్న 16 మంది క్షయ రోగులకు ఎంపిపి గొర్లి సూరిబాబు, వైద్య సిబ్బంది బుధవారం పోషకాహార కిట్లు అందించారు. చికిత్సా కాలం 6 నెలలు కందిపప్పు, పెసరపప్పు, గోధుమ పిండి, రాగి పిండి, కొమ్ము శనగలు, వేరు శనగ పలుకులు, వంట నూనె కిలో చొప్పున అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పిహెచ్సీ వైద్యురాలు జి.పావని, వైస్ ఎంపీపీ అయితా ఆనందరాము, సర్పంచ్ యాదగిరి అప్పారావు, ఫార్మసిస్టు వెంకటేశ్వర్లు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రూపు రాజకీయాలు చేస్తే సహించేది లేదు

ప్రజాశక్తి- కశింకోట : టిడిపిలో గ్రూపు రాజకీయాలు చేస్తే సహించేది లేదని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ హెచ్చరించారు. మండలంలోని బయ్యవరం గ్రామానికి టిడిపి కోర్ కమిటీని బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో కష్టపడే వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ సందర్భంగా టిడిపి చేరిన మహిళా నాయకులకు ఆయన కండువాలు కప్పి ఆహ్వానించారు. టిడిపి మండల అధ్యక్షుడు కాయల మురళి, నాయకులు ఉగ్గిన రమణ మూర్తి, గొంతిని శ్రీనివాసరావు, షేక్ బాబర్, సిద్దిరెడ్డి శ్రీనివాసరావు, సిద్దిరెడ్డి ప్రసాద్, సిద్దిరెడ్డి సూర్యనారాయణ, చామంతుల శ్రీనివాసరావు, గొల్లవిల్లి ప్రవీణ్, చెట్టుపల్లి అప్పల నాయుడు, కలగా సన్యాసి నాయుడు పాల్గొన్నారు.

## దెబ్బతిన్న గ్రోయిన్ల మరమ్మతుకు కృషి

ప్రజాశక్తి- అనకాపల్లి : శారదానది పరివాహక ప్రాంతంలో గ్రోయిన్ల మరమ్మతులకు తన వంతు కృషి చేస్తానని వైసిపి పార్లమెంటరీ పరిశీలకులు దాడి రత్నాకర్ చెప్పారు. బుధవారం ఆయన మండలంలోని తగరంపూడి గ్రామంలో గ్రోయిన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో దాడి వీరభద్రరావు పక్కాగా బ్రియన్ మోడల్లో నిర్మాణం చేసి రైతులకు సాగునీరు అందించారని గుర్తు చేశారు. నేడు శారదా నది నీరు అందక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, వ్యవసాయం చేద్దామా లేదా అన్న సందిగ్ధంలో ఉన్నారని తెలిపారు. ఈ గ్రోయిన్ శాశ్వత నిర్మాణం చేయడానికి రూ.77 లక్షలు ప్రభుత్వ గ్రాంటు కోసం ఇరిగేషన్ డిపార్ట్మెంట్ వారు ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రిని కలిసి నిధులు మంజూరుకు కృషి చేస్తామన్నారు. రైతు సంఘాల నాయకులు బొడ్డపాటి రాజారావు, భీశెట్టి కృష్ణ అప్పారావు పాల్గొన్నారు.

## మద్యం సేవించిన వ్యక్తి కారు స్టార్ట్ చేస్తే స్టార్ట్ కాని పరికరం రూపకల్పన

ప్రజాశక్తి-అనకాపల్లి : మద్యం సేవించి కారు ఎక్కి స్టార్ట్ చేస్తే కారు స్టార్ట్ అవ్వకుండా ఉండే పరికరాన్ని అనకాపల్లి జిల్లా దాడి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల విద్యార్థినులు బి.ప్రణతి దేవి, బి.కుసుమాంజలి రూపొందించారు. తాగి వాహనాలు నడిపిన సందర్భాలలో ప్రమాదాలు జరుగుతున్నాయని, ఈ పరికరం ద్వారా తాగి వాహనాన్ని స్టార్ట్ చేదామన్న స్టార్ట్ అవ్వదని విద్యార్థులు తెలిపారు. ఈ పరికరం తయారు చెయ్యడానికి రూ.1000 ఖర్చు చేసినట్లు ప్రొజెక్ట్ ఇంజనీర్ బి. శేషగిరి రావు చెప్పారు. ఈ ప్రాజెక్టుకి గైడ్‌గా సరిత వ్యవహరించారు. ఈ ప్రాజెక్ట్ చేసిన విద్యార్థులను కళాశాల ఛైర్మన్ దాడి రత్నాకర్, ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, డీన్ అకాడమిక్స్ డాక్టర్ కె.పార్వతి, బి.శేషగిరిరావు, ఈసిఈ విభాగాధిపతి డాక్టర్ పి.పూర్ణప్రియ అభినందించారు.

ఎపి సచివాలయానికి..

# ఎమ్మెల్యే గణేష్, కౌన్సిలర్ల పరుగులు

**-రోడ్డు విస్తరణకు హైకోర్టు స్టేపై మంత్రులు, నేతలతో మంతనాలు**

మాజీ మంత్రి పేర్ని నానిని కలిసిన ఎమ్మెల్యే గణేష్

**ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:** నర్సీపట్నం అబీద్ సెంటర్ నుండి పెద్ద బొడ్డేపల్లి వరకు రోడ్డు విస్తరణ చేపట్టేందుకు తీసుకున్న నిర్ణయాలు పలు మలుపులు తిరుగుతున్నాయి. వంద అడుగుల రోడ్డు విస్తరణ చేసేందుకు ఎన్ని అడ్డంకులు వచ్చినా సరే కృత నిశ్చయంతో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఉన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి దగ్గర నుంచి అనుమతులు రాబట్టడం, శంకుస్థాపన పనులు పూర్తి చేశారు. రోడ్డు నిర్మాణానికి కొన్ని రోజులుగా వ్యాపారస్తులకు, అధికారులకు మధ్య చర్చలు జరుగుతున్నప్పటికీ విస్తరణ చేసేందుకు వెనుకాడేది లేదంటూ ఎమ్మెల్యే పట్టుపట్టారు. 80 అడుగులు విస్తరణ చేస్తే తమకు ఏ అభ్యంతరం లేదంటూ వ్యాపారస్తులు పట్టుపట్టారు. ఎట్టకేలకు రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించే సమయంలో బీసీ జాతీయ ప్రచార కమిటీ అధ్యక్షులు వైసీపీ నాయకులు పోతల ప్రసాద్ మీడియా సమావేశం పెట్టి సంచలనం సృష్టించారు. మీడియా సమావేశం మరుసటి రోజే రోడ్డు విస్తరణ పనులు నిలుపుదల చేయాలంటూ హైకోర్టు స్టే విధించింది. ఈ విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే గణేష్, మున్సిపల్ కౌన్సిలర్లు పరుగులు పెడుతూ ఏపీ సచివాలయానికి చేరుకొని మంత్రులతో మంతనాలు చేస్తున్నారు. ఎమ్మెల్యే నిర్ణయాలను తప్పుగా అభివర్ణిస్తూ 100 అడుగులు కాదు 80 అడుగుల విస్తీర్ణం జరుగుతుందని, అది కూడా ఎన్నికల అనంతరం మాత్రమే విస్తరణ చేపడతామని ప్రసాద్ మీడియా సమావేశంలో తెలిపిన విషయం తెలిసిందే. ఎమ్మెల్యే లేకుండా రోడ్డు విస్తరణపై ప్రసాద్ ఒక్కరే సమావేశాన్ని ఏర్పాటు చేయడంపై పలు అనుమానాలు రేపిస్తున్నాయి. రోడ్డు విస్తరణ విషయంలో నియోజకవర్గ వైసీపీకి చెందిన ఒక ప్రథమ శ్రేణి నాయకుడు ప్రయత్నంతోనే రోడ్డు విస్తరణ పనులు ఆగేలా ఉన్నాయని తెలుస్తోంది. అతను స్థానికుడు కావడం, వ్యాపారస్తులతో మంచి సంబంధాలు ఉండటం తోనే వ్యాపారస్తులకు సహకరిస్తున్నారని తెలుస్తోంది. ఈ వ్యవహారాలు చూస్తుంటే ఎమ్మెల్యేకి వర్గ పోరు తప్పడం లేదనేది స్పష్టమవుతోంది. ఈ వర్గ పోరుతోనే రోడ్డు విస్తరణ పనులు పలు మలుపులు తిరుగుతోంది.పట్టణంలో వ్యాపారస్తులు ఎమ్మెల్యే పై గుర్రుగానే ఉన్నారు. ఈసారి ఎమ్మెల్యే పదవికి గండం ఉన్నట్లు తెలుస్తోంది. వ్యాపారస్తులకు సహకరిస్తున్న నియోజకవర్గ ముఖ్య నాయకులు ఎమ్మెల్యే సీటును దక్కించుకుంటారనే ప్రచారం జరుగుతోంది.

అంబులెన్సులు ప్రారంభిస్తున్న జన సైనికులు

## అంబులెన్స్‌లు ప్రారంభం

**ప్రజాశక్తి-మాడుగుల:**ప్రజల అవసరాల నిమిత్తం జనసేన నేత రాయపు రెడ్డి కృష్ణ ఆర్థిక సహాయంతో బుధవారం మాడుగులలో రెండు అంబులెన్స్‌లు ప్రారంభించారు. మాడుగుల, చీడికాడ మండలాలకు ఒకటి, దేవరాపల్లి, కె.కోటపాడు మండలాలకు మరొకటి చొప్పున రెండు అంబులెన్స్ లు ఏర్పాటు చేస్తున్నట్లు కృష్ణ తెలిపారు. అంతకు ముందు జన సైనికులతో గ్రామంలో భారీ ఊరేగింపు నిర్వహించి, అనంతరం బస్ స్టాండ్ ఆవరణలో వీటిని ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో నాలుగు మండలాలకు చెందిన జనసేన కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

డ్రెయినేజీలో చేపడుతున్న పారిశుధ్య పనులు

## పారిశుధ్య పనులు

**ప్రజాశక్తి-గొలుగొండ:**మండలంలోని పాత మల్లంపేట పంచాయతీలో సర్పంచ్ గెడ్డం ఆదిలక్ష్మి ఆనంద్ ఆధ్వర్యంలో కార్యదర్శి రమణ ముమ్మరంగా పారిశుధ్య పనులను చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మురుగునీటి నిల్వలు చేరకుండా పూడికతీతను చేపట్టమన్నారు. పంచాయతీలో పాత మల్లంపేట, ద్వారకానగర్, కొత్తపాలెం గ్రామాల్లో కాలువల పూడిక తీత పనులను చేస్తున్నామన్నారు. పంచాయతీలో పారిశుధ్యం పై దృష్టి సారించి పనులు చేస్తామని ఆమె తెలిపారు.

## ఆర్‌బికెకు బూడి పేరు పెట్టడం సిగ్గు చేటు : టిడిపి

**ప్రజాశక్తి-మాడుగుల:**మండలంలోని ఎం.కోడూరు లో నిర్మించిన రైతు భరోసా కేంద్రానికి ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు పేరు పెట్టడం విడ్డూరంగా ఉందని టిడిపి నేత పైలా ప్రసాదరావు విమర్శించారు..ప్రజల పన్నులతో అమలు చేసే ప్రభుత్వ పథకాలకు, నిర్మాణాలకు వ్యక్తుల పేరు పెట్టేందుకు ప్రభుత్వం అనుమతి ఇస్తుందని, దాన్ని అధికారులు అమలు చేయడం రివాజుగా వస్తుందన్నారు. కోడూరులో ఆర్‌బికెకు మంత్రి పేరు పెట్టడం, స్వయంగా ఆయనే ప్రారంభించడం విడ్డూరంగా ఉందన్నారు. వైసిపి ప్రభుత్వం రైతులకు చేసింది ఏమీ లేదని, విత్తనాలు, ఎరువుల పంపిణీ, పంటలు గిట్టుబాటు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఈ సమస్యలు పట్టించుకోకుండా ప్రజల సొమ్ముతో నిర్మించిన భవనాలకు వారి పేరు పెట్టుకోవడం సరికాదన్నారు.

# పోడు భూములకు పట్టాలివ్వాలి

భూములు పరిశీలిస్తున్న అప్పలరాజు

**ప్రజాశక్తి-నక్కపల్లి:**మండలంలోని రేబాక పంచాయతీ శివారు తిరుపతిపాలెం గిరిజనుల సాగులో ఉన్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, తిరుపతిపాలెం గిరిజనలు గత 50 సంవత్సరాలుగా పోడు భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తు న్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం 2005లో తీసుకు వచ్చిన అటవీ హక్కుల చట్టం ప్రకారం గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు 10 ఎకరాల వరకు పట్టాలు ఇవ్వ వచ్చునని, దానికి అనుగుణంగా తిరుపతిపాలెం గ్రామంలో 2021 సంవత్సరంలో సర్వే చేసి లబ్దిదారులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. నేటి వరకు సాగులో ఉన్న గిరిజనులకు పట్టాలు ఇవ్వలేదని తెలిపారు. దీంతో ప్రభుత్వం నుండి వస్తున్న రైతు భరోసా, పిఎం కిసాన్ వంటి పథకాలను గిరిజనలు పొందలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి.డేవిడ్ రాజు, శ్రీను, అప్పారావు, వెంకటరమణ పాల్గొన్నారు.

పథకాలను అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

## గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

**ఎమ్మెల్యే బాబూరావు**

**ప్రజాశక్తి-కోటవురట్ల:**వైసిపి ప్రభుత్వంలో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు తెలిపారు. బుధవారం ఆయన కైలాసపట్నం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్మాణం చేపట్టిన సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జగనన్న ప్రభుత్వంలోని గ్రామీణ ప్రాంతాలు అన్ని విధాలుగా అభివృద్ధి బాట పయనిస్తున్నాయన్నారు. అనంతరం గ్రామంలో గడపగడపకు తిరిగి స్థానికుల సమస్యలు అడిగి తెలుసు కోవడంతో పాటు సంక్షేమ పథకాల పై ఆరా తీశారు. అర్హులు అందరికీ పథకాలు అందేలా చూడాలని అధికారులకు సూచించారు. పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణ రాజు, జడ్పిటిసి సభ్యురాలు ఉమాదేవి, స్థానిక సర్పంచ్ నూకరత్నం, ఎంపీటీసీ సభ్యులు వెంకటరమణ, ఉప సర్పంచ్ నాగేశ్వరరావు, ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, డిప్యూటీ తహసిల్దార్ సోమశేఖర్, నియోజకవర్గ మీడియా విభాగపు కో- కన్వీనర్ సిహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# 30న ధర్నాను జయప్రదం చేయండి : సిపిఎం



ప్రచారం చేపడుతున్న సిపిఎం నేతలు

**ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్:** ఈనెల 30న విద్యుత్ డివిజనల్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు కోరారు. కృష్ణాబజారు, ఎన్‌టిఆర్ స్టేడియం తదితర ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల అమలు నిర్ణయాన్ని విరమించు కోవాలని డిమాండ్ చేశారు. వాడిన విద్యుత్ కంటే సర్దుబాటు, ఇతర సుంకాల పేరుతో అదనపు భారం మోపుతున్నారని, సామాన్యుడికి వేల రూపాయిలు విద్యుత్ బిల్లు వస్తుందని తెలిపారు. ఈ స్మార్ట్ మీటర్లకు ప్రభుత్వం అధికంగా ఖర్చు చేస్తుందని, ఆదాని వంటి కార్పొరేట్ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం దోచి పెడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఈరెల్లి చిరంజీవి, రమణ తదితరులు పాల్గొన్నారు.

# ఉపమాకలో తొలి ఏకాదశికి ఏర్పాట్లు

**ప్రజాశక్తి-నక్కపల్లి:**ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో ఈనెల 29న గురువారం నాడు తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని గరుడాద్రి పర్వతంపై ఉన్న కల్కి వెంకటేశ్వర స్వామి మూలవిరాట్‌కు తెల్లవారుజామున నాలుగున్నర గంటలకు ప్రత్యేక అభిషేకం నిర్వహిస్తామన్నారు. భక్తులందరికీ దర్శన సౌకర్యం నిమిత్తం కొండ దిగువన ఆలయ క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి ఉపాలయాలలో నిత్యార్చనలు చేసి భక్తులందరికీ రాత్రి 7 గంటల వరకు దర్శన సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా గురువారం సాయంత్రం స్థానిక శ్రీనివాస భక్త సమాజం వారిచే హరినామ సంకీర్తనలతో గిరి ప్రదక్షిణ ఉత్సవం జరుగుతుందని, ఇందుకు సంబంధించి తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని ప్రసాద్ ఆచార్యులు తెలిపారు.

వెంకన్న ఆలయం

### హైకోర్టు స్టేతో
## రోడ్డు విస్తరణ నిలుపుదల

**ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:**నర్సీపట్నం ప్రధాన రహదారి విస్తరణ పనులు తాత్కాలికంగా నిలుపుదల చేయాలంటూ రాష్ట్ర హైకోర్టు తాత్కాలికంగా స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు పలువురు రిట్ పిటీషన్లు దాఖలు చేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గత డిసెంబర్ 30న రోడ్డు వెడల్పు పనులకు శంకుస్థాపన చేసి రూ.10.5 కోట్ల నిధులు మంజూరు చేశారు. దీంతో స్థానిక అబీద్ కూడలి నుంచి పెద్ద మదుం వరకు వంద అడుగుల మేర రహదారి విస్తరణకు వీలుగా మున్సిపల్ అధికారులు మార్కింగ్ తదితర అన్ని ప్రక్రియలు పూర్తి చేసి భవనాల యజమానులకు కట్టడాల తొలగింపునకు వీలుగా చివరి నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసుల ఆధారంగా విస్తరణ ప్రక్రియతో తామంతా తీవ్రంగా నష్టపోతామని పేర్కొంటూ భవన యజమానులు 18 మంది హైకోర్టును ఆశ్రయించారు. దీంతో వీరికి మాత్రమే స్టే మంజూరు చేస్తూ తొలగింపు పనులు నిలిపి వేయాల్సిందిగా మున్సిపల్ అధికారులకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. తరువాత ఆదేశాలు ప్రకటించే వరకు వీటిని చేపట్టరాదని పేర్కొంది. కోర్టుకు వెళ్లిన మరో 14 మందికి సైతం ఈ విధంగానే ఉత్తర్వులు వచ్చాయి. ఈ విషయమై మున్సిపల్ అధికారులెవరూ స్పందించ లేదు.

ఇలా ఉండగా ఈ రోడ్డు విస్తరణను ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఎమ్మెల్యే, కొందరు కౌన్సిలర్లు మంగళవారం ఈ ప్రాంతంలోని గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సైతం వాయిదా వేసుకొని విజయవాడకు పయనమయ్యారు. వీటిపై మంగళగిరిలో అడ్వకేట్ జనరల్, కొందరు న్యాయవాదులతో మంతనాలు చేసినట్లు సమాచారం. హైకోర్టు స్టే ఇచ్చిన నేపథ్యంలో వ్యాపారులు, భవన యజమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బాధితులతో మాట్లాడుతున్న సిఐ

### జనావాసాల్లో తారు, మెటల్ యంత్రం ఏర్పాటుపై
## మహిళలు, యువకుల ఆందోళన

**ప్రజాశక్తి-కొత్తకోట:**రావికమతం మండలం కొత్తకోటలో జనావాసాలు మధ్య ఏర్పాటు చేసిన తారు యంత్రాన్ని తక్షణం తొలగించాలని డిమాండ్ చేస్తూ పలువురు మహిళలు, యువకులు తారు ప్లాంట్, పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం సాయంత్రం ఆందోళన చేశారు. రోలుగుంట మండలం వెలంకాయపాలెం నుంచి గంధవరం వరకూ రహదారి విస్తరణ పనులు చేస్తున్న ఎస్ఆర్ కనస్ట్రక్షన్ నిర్వాహకుడు స్థానిక ప్రకాష్ నగర్ ఆనుకుని జనావాసాల మధ్య తారు, మెటల్ మిక్సింగ్ యంత్రాన్ని ఏర్పాటు చేశారు. మొదట్లో పెద్దగా పొగ రాకున్నా గడచిన 15 రోజులుగా దీని నుంచి దట్టమైన తారుపొగ వెదజల్లుతోంది. సమీపంలోని ఇళ్లల్లోని జనం ఈ పొగ దాటికి ఉక్కిరి బిక్కిరి. అవుతున్నారు. గుండెలు మండిపోతున్నాయని దగ్గు విపరీతంగా వస్తోందంటూ నివాశితులు చింతల కిషోర్, లావణ్య, మహాలక్ష్మి, జెవి.వరలక్ష్మి కోట వీరాస్వామి తదితర్లు ఫ్యాక్టరీ వద్ద ఆందోళన చేశారు. తక్షణం ప్లాంట్ను వేరే చోటికి తరలించాలన్నారు. అనంతరం పంచాయితీ కార్యాలయానికి చేరుకుని ఆందోళన చేసి వినతిపత్రాన్ని ఉప సర్పంచ్ పందల దేవాకు అందించారు. సంఘటనా స్థలానికి కొత్తకోట సిఐ సయ్యద్ ఇలియాస్ మహ్మాద్ చేరు కొని ఆందోళన చేస్తున్న గ్రామస్తులతో మాట్లాడారు. రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్తో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# జగనన్న సురక్షతో ప్రజలకు సేవలు

**ప్రజాశక్తి- సబ్బవరం:**జగనన్న సురక్ష కార్యక్రమంపె మండలంలోని మొగలిపురం గ్రామంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సచివాలయం కన్వీనర్ యడ్ల నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపిపి బోకం సూర్యకుమారి మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా కుల, ఆదాయ, వివాహ, జనన, మరణ ధ్రువపత్రాలు, ఆధార్, రేషన్ కార్డులు, భూముల మ్యుటేషన్, రిజిస్ట్రేషన్ వంటి సేవలు సచివాలయంలోనే ఉచితంగా అందించనున్నట్లు చెప్పారు. మండల జెసిఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, జగనన్న సురక్ష ఇన్ఛార్జి కోటాన రాము, వైసిపి నాయకులు బోకం రామునాయుడు, వీఆర్వో జ్యోతి, సచివాలయం కన్వీనర్లు ఐడి బాబు, గండి మహాలక్ష్మి, పైల రామునాయుడు, బత్తిన వెంకట్, జెట్టి హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

**అనకాపల్లి :** మండలంలోని గోపాలపురం గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష పథకం మీద బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపిపి గొర్లి సూరిబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జెర్రిపోతుల లక్ష్మి, ఎంపీడీవో కేవీ నరసింహరావు, ఈవోపీఆర్డీ కే ధర్మారావు, మార్టూరు సర్పంచ్ రెవెన్యూ నాయుడు, అధికారులు పాల్గొన్నారు.

**మునగపాకరూరల్:**మండలంలోని శిరసపల్లి గ్రామ సచివాలయంలో బుధవారం జగనన్న సురక్షపై వాలంటీర్లు, గృహసారథులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శిరసపల్లి సర్పంచ్ మద్దాల ధనలక్ష్మి, ఎంఎల్ఓ సంజయ్ కుమార్, ఎంపీటీసీ మద్దాల వీరు నాయుడు, బొడ్డేడ జగ్గారావు, గృహ సారథులు పాల్గొన్నారు.

**కోటవురట్ల:**ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న సురక్ష పథకం దరఖాస్తులు పట్ల నిర్లక్ష్యం చేయరాదని మండల ప్రత్యేక అధికారి ఉదయశ్రీ అన్నారు. బుధవారం రాజపేటలో నిర్వహిస్తున్న జగనన్న సురక్ష పథకం పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మండలంలో చేపడుతున్న కోటవురట్ల రెండు సచివాలయాలు, చౌడవాడ, రాజుపేట సచివాలయాల పరిధిలో 282 దరఖాస్తులు వచ్చినట్లు ఆమె తెలిపారు. వీటిలో 194 దరఖాస్తులు సంబంధిత అధికారులు పరిశీలనకు పంపించినట్లు పేర్కొన్నారు. కోటవురట్లలో 188, కోటవురట్ల 2లో 85, చౌడువాడ 126, రాజుపేట 95, వివిధ ధ్రువ పత్రాలకు దరఖాస్తు చేసుకున్నట్లు ఆమె తెలిపారు. వీరికి సమగ్ర విచారణ అనంతరం వచ్చే నెల ఒకటి, మూడు తేదీల్లో జగనన్న సురక్ష ధ్రువ పత్రాలు అందజేస్తామన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, పిఓపిఆర్డి సుబ్రహ్మణ్యం, పాల్గొన్నారు.



కోటవురట్లలో పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి

మాట్లాడుతున్న తహశీల్దార్

## సమస్యలపై దృష్టి

**ప్రజాశక్తి -కోటవురట్ల:** పెండింగ్ సమస్యల పరిష్కారానికి దృష్టి సారించాలని తహసిల్దారు జానకమ్మ సూచించారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన గ్రామ రెవెన్యూ అధికారుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ప్రధానంగా ముటేషన్, సకాలంలో ధ్రువ పత్రాలు అందజేయడంలో నిర్లక్ష్యం చూపరాదన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దారు సోమశేఖర్, ఆర్ఐ వుర్ధవరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## దంత వైద్యులుగా శిరీష

**ప్రజాశక్తి -నక్కపల్లి:**నక్కపల్లి 50 పడకల ఆసుపత్రిలో దంత వైద్యులు శిరీష నియామకం అయ్యారు. ఈ మేరకు బుధవారం ఆమె బాధ్యతలు చేపట్టారు. గతంలో డెంటల్ డాక్టర్గా పని చేసిన వరప్రసాద్ 6 నెలల క్రిందట బదిలీపై వెళ్లారు.

# ఖాతాదారుల ఆదరణతో అభివృద్ధి

### కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు 24వ మహాజన సభలో చైర్మన్ కె.రాంబాబు

**ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ :** ఖాతాదారుల ఆధరణతో కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు మరింత అభివృద్ధి చెందుతోందని బ్యాంక్ చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు తెలిపారు. మద్దిలపాలెం సమీపంలోని ఎన్ఆర్సి కాకతీయ కన్వెన్షన్ సెంటర్లో కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు 24వ మహాజన సభ బుధవారం నిర్వహించారు. బ్యాంకు చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన సభలో బ్యాంకు వ్యవస్థాపక అధ్యక్షులు పరుచూరు రఘునాధరావు మాట్లాడుతూ, బ్యాంకు స్థాపించినప్పటి నుంచి 24 ఏళ్లుగా తనకు సహకరించిన విధంగా నూతన అధ్యక్షులకు కూడా సహకరించాలని సభ్యులను కోరారు. అనంతరం నూతన అధ్యక్షులు కొమ్మారెడ్డి రాంబాబు మాట్లాడుతూ, దేశ ఆర్థిక వ్యవస్థకు అనుగుణంగా బ్యాంకు కార్యకలాపాలు సాగిస్తూ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతూ, మెరుగైన ఫలితాలను సాధించిందని వివరించారు. ఖాతాదారుల ఆధారాభిమానాలతో ఇప్పటికి రాష్ట్రంలోని పలు జిల్లాలో 25 శాఖలను నెలకొల్పామని, రానున్న కాలంలో మరిన్ని శాఖలను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన డైరెక్టర్లను సభ్యులకు అధ్యక్షులు పరిచయం చేశారు. అనంతరం బ్యాంకు ముఖ్య నిర్వాహణాధికారి కె.శ్యామ్ కిశోర్ మహాసభ చర్చనీయాంశములు చదివి వినిపించారు. 2022-23 సంవత్సరానికి బ్యాంకు 24వ పరిపాలనా నివేదిక, ఆడిట్ రిపోర్టు, బడ్జెట్కు మించి అయిన అదనపు వ్యయము, ఆడిట్ రిపోర్టు ప్రకారం 2022-23 సంవత్సరంలో బ్యాంకు సాధించిన నికరలాభం, బైలా నెంబర్ 44ను అనుసరించి పాలకవర్గం సిఫారసుల మేరకు కేటాయింపులు చేయుట, బ్యాంకు బడ్జెటును, 2023-24 సంవత్సరమునకు సంబంధించిన బ్యాంకు లెక్కలను ఆడిటు చేయుటకు చార్టర్డు ఎకౌంటెంటును ఆడిటర్గా నియమించుట తదితర అంశాలను సభ్యులచే ఆమోదింపచేశారు. 2022-2023 సంవత్సరంలో నిర్వహించిన బ్యాంకు ఆడిటర్లు బ్యాంకును 'ఏ' గ్రేడుగా శ్రేణికరించారని సభ్యులకు తెలుపుతూ, షేర్ హోల్డర్లకు 13 శాతం డివిడెండ్ను అధ్యక్షులు ప్రకటించడంతో సభ్యులంతా హర్షధ్వానాలు వ్యక్తం చేశారు. బ్యాంకు రూ.773 కోట్ల డిపాజిట్లను కలిగి, రూ.469 కోట్లు రుణాలను మంజూరు చేసి, రూ.9.32 కోట్ల నిఖరలాభంతో ఉందని వివరించారు. అనంతరం పలు పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన సభ్యుల పిల్లలకు స్కాలర్షిప్లను అందజేశారు. ఈ సమావేశంలో బ్యాంకు డైరెక్టర్లు ఎం.రాఘువేంద్రరావు, బి.నాగేశ్వరరావు, ఆర్.వెంకటేశ్వరరావు, సిపి.రామారావు, ఎస్ఎస్ఆర్.ఆంజనేయులు, డాక్టర్ వై.రమేష్, సిహెచ్.శ్రీనాథవెంకటేశ్వరరావు, డాక్టర్ మోటూరి శ్రీరామకృష్ణ, రేవు రత్నకుమారి, పి.హరీష్, కెసిఎస్ గురుప్రసాద్, బి.పుల్లయ్య, పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్షిప్‌లు అందిస్తున్న బ్యాంకు ప్రతినిధులు, అతిథులు

# రైతులకు వరి విత్తనాల పంపిణీ

**ప్రజాశక్తి- కశింకోట:** మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో రైతులకు ప్రభుత్వం రాయితీపై మంజూరు చేసిన విత్తనాలను రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు బాగుంటే రాష్ట్రం బాగుంటుందని తెలిపారు. జెడ్పిటిసి శ్రీధర్ రాజు, ఎంపీపీ కలగా లక్ష్మి గున్నయ్యానాయుడు, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతిశ్రీనివాస్, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, సర్పంచ్ మంత్రి రజిని, అనకాపల్లి ఎంపీపీ సూరిబాబు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కిషోర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**మునగపాక రూరల్ :** మండలంలోని తోటాడ గ్రామ సచివాలయంలో సబ్సిడీపై విత్తనాలను స్థానిక సర్పంచ్ దొడ్డి మంగవేణి పంపిణీ చేశారు. ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి, వైసిపి నాయకులు దొడ్డి కోటేశ్వరరావు, సచివాలయ సెక్రటరీ కాండ్రేగుల లక్ష్మీ నారాయణ, వార్డు సభ్యుడు బుద్ధ రమేష్ నాయుడు పాల్గొన్నారు.

**గొలుగొండ:** ఖరీఫ్ సీజన్ మొదలవడంతో రైతులకు సకాలంలోనే విత్తనాలు ప్రభుత్వం అందచేయడంతో వ్యవసాయం చేసుకుందుకు అన్ని విధాలుగా అనువుగా ఉంటుందని జడ్పిటిసి సుర్ల వెంకటగిరి గిరిబాబు, వైస్ ఎంపీపీ జక్కు నాగమణి తెలిపారు. చీడిగుమ్మల, గొలుగొండ, జోగంపేట తదితర గ్రామాలలో రైతు భరోసా కేంద్రాలు, సచివాలయం వద్ద రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఎంపిటిసి సత్యనారాయణ, వైసీపీ మండల అధికార ప్రతినిధి జక్కు అప్పలస్వామి నాయుడు, వ్యవసాయ అధికారిని సత్యవేణి, జువ్వలదేవుడు పాల్గొన్నారు.

**మాడుగుల:**మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో బుధవారం సబ్సిడీపై వరి విత్తనాలు పంపిణీ చేశారు. సాంబ మసూరి, సొన మాసూరి, స్వర్ణ మసురి, ఇంద్ర, శ్రీకాకుళం సన్నాలు వంటి వంగడాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కళావతి, ఎంపిటిసి విజయలక్ష్మి, వార్డు సభ్యులు మహేశ్వరి, ఆర్బికే అధ్యక్షులు శ్రీదర్, వ్యవసాయ అధికారి వాసుదేవరావు, సిబ్బంది సత్యనారాయణ, జ్యోతి, రేణుక పాల్గొన్నారు.

పంపిణీ చేస్తున్న సర్పంచ్, నేతలు